

19వ వసంతంలోకి ...

# సూర్య

నేటి దినపత్రిక

www.suryaa.com

కాకినాడ జిల్లా
కోనసీమ జిల్లా
తూర్పు గోదావరి జిల్లా
పోలవరం(రంపచోడవరం)జిల్లా

ఆదివారం,8 మార్చి 2026

8 పేజీలు


## హాస్టల్ విద్యార్థుల
# సంక్షేమం అంటే ఇదేనా?

**- జ్యూడిషియల్ మేజిస్ట్రేట్ ఆవేదన,ఆగ్రహం!**





**రంపచోడవరం,మేజర్‌న్యూస్ :** ఏజెన్సీ ప్రాంతంలో గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో గిరిజన విద్యార్థుల సంక్షేమాన్ని సరిగా పట్టించుకోవడం లేదని రంపచోడవరం జ్యూడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ ఎం.మురళీ గంగాధరరావు ఆవేదన వ్యక్తంచేశారు .రంపచోడవరం మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జ్యూడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ ఎం.మురళీ గంగాధరరావు మారేడుమిల్లి మండలం దేవరపల్లి గ్రామంలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర ఉన్నత పాఠశాలను శనివారం ఆకస్మిక తనిఖీ చేసారు. హాస్టల్ వసతులు అస్సలు బాగోలేవని, పాడైపోయిన, బూజు పట్టిన వస్తువులు పడవేయకుండా ఉపయోగిస్తున్నారని, వాటితోనే పిల్లలకు వండి పెడుతున్నారని ఆయనఆగ్రహంవ్యక్తం చేసారు. వండటానికి ఉపయోగించే కిరాణా సరుకులు, కూరగాయలు నాణ్యత లేవని, కనీసం పిల్లలకు రోజు వారి పెట్టె అరటిపళ్ళు మంచిగా లేవని, వాటిని తింటే పిల్లలు అనారోగ్యం పాలు అవుతారని హాస్టల్ వార్డెన్, స్కూల్ హెడ్ మాస్టర్ ను నిలదీశారు. దీనివల్లే పిల్లలు అస్వస్థతకు గురవవుతున్నారని హాస్పిటల్ పాలు అవుతున్నారన్నారు. పిల్లల ఆరోగ్యాన్ని ఏమాత్రం లెక్క చేయకుండా, ఎవరికి నచ్చినట్టు

- తరువాయి 2లో..

## అక్రమ కేసులను
# ధైర్యంగా ఎదుర్కొంటాం

- కార్యకర్తలకు వైఎస్సార్‌సీపీ కొండంత అండ !

- తిమ్మాపురం సర్పంచ్ బెజవాడ సత్యనారాయణను పరామర్శించిన దాడిశెట్టి రాజా, దవులూరి దొరబాబు





**కాకినాడరూరల్,మేజర్‌న్యూస్ :** రాష్ట్రంలో సాగుతున్న కక్ష సాధింపు రాజకీయాలకు భయపడే ప్రసక్తే లేదని, అక్రమ కేసులను న్యాయపోరాటం ద్వారా ధైర్యంగా ఎదుర్కొంటామని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ స్పష్టం చేసింది. రాజకీయకక్షలతో పార్టీనేతలను, కార్యకర్తలను ఇబ్బందులకు గురిచేయడం తగదని, ప్రతి కార్యకర్తకూ పార్టీ నాయకత్వం అండగా ఉంటుందని నేతలు భరోసా ఇచ్చారు.

**అక్రమ అరెస్టులపై ఆగ్రహం..** కాకినాడ రూరల్ పరిధిలో అక్రమకేసులో అరెస్ట్ అయిన రాష్ట్ర వైఎస్సార్ సీపీ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యుడు మరియు తిమ్మాపురం సర్పంచ్ బెజవాడ సత్యనారాయణను శనివారం పార్టీ జిల్లా అధ్యక్షులు దాడిశెట్టి రాజా, పెద్దాపురం నియోజకవర్గ ఇంచార్జ్ దవులూరి దొరబాబు పరామర్శించారు. ఈసందర్భంగా ఆయనపై నమోదైన కేసు వివరాలను అడిగి తెలుసుకున్న నేతలు, ప్రభుత్వ తీరుపై తీవ్రఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రజాప్రతి నిధులపై ఇలాంటి వేధింపులకు

- తరువాయి 2లో..

# కాకినాడ నగరంలో స్వచ్ఛతపై ప్రజల్లో మార్పు అవసరం

**- కమిషనర్ ఎన్.వి.వి.సత్యనారాయణ**



**కాకినాడ,మేజర్‌న్యూస్ :** కాకినాడ నగరంలో స్వచ్ఛతపై ప్రజల్లో ఇంకా అవగాహన పెరగాల్సిన అవసరం ఉందని కాకినాడ నగర పాలక సంస్థ కమిషనర్ ఎన్.వి.వి. సత్యనారాయణ పేర్కొన్నారు. శనివారం నగరంలోని 3వడివిజన్ పరిధిలోని మూడు గుడిళ్ళ సెంటర్, శాంతన పురి కాలనీ ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించి పారిశుధ్య నిర్వహణ పనులను ఆయన పరిశీలించారు. మూడు గుడిళ్ళ సెంటర్ వద్ద డ్రైనేజీలను ఆక్రమించివ్యాపారసముదాయాలునిర్వహిస్తున్నట్లు గుర్తించిన కమిషనర్ సంబంధిత వ్యాపారులను పిలిచి డ్రైనేజీలపై ఆక్రమణలుచేయడంసరికాదని హెచ్చరించారు. అనంతరంవారిచేతనే ఆక్రమణలను తొలగింపజేశారు. అదేవిధంగా త్రాగునీటి కుళాయి ద్వారా వచ్చే నీటితో వాకిలిని శుభ్రం చేస్తున్నట్లు గమనించిన కమిషనర్ ఆ ఇంటికి వెళ్లి ఇంటి యజమానిని మందలించారు. త్రాగునీటిని వృథా చేయడం సరైంది కాదని సూచిస్తూ రెండు రోజుల పాటు ఆ ఇంటి కుళాయి

- తరువాయి 2లో..

# పారిశుధ్య పనులను పరిశీలించిన జాయింట్ కలెక్టర్



**కాకినాడ,మేజర్‌న్యూస్ :** కాకినాడ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో చేపట్టిన ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలను శనివారం జిల్లా జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్.. మున్సిపల్ అధికారులతో కలిసి పరిశీలించారు. కాకినాడ - సామర్లకోట కెనాల్ రోడ్డుకు ఇరుపక్కల ఉన్న పెంటకుప్పలు, చెత్తను యంత్రాలతో తొలగిస్తున్నారు. ఇంద్రపాలెం బ్రిడ్జ్ దగ్గర నుంచి ప్రతాప్ నగర్ సెంటర్ మీదుగా రోడ్డుకు ఇరువైపులా ఉన్న కాలువులోని చెత్తను రాజమహేంద్రవరం నుంచి ప్రత్యేకంగా తీసుకొచ్చిన పెద్ద జేసీబీ సహాయంతో చెత్తను తొలగించే పనులను ఈ సందర్భంగా జేసీ పరిశీలించి, అధికారులను వివరాడికి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జేసీ అపూర్వ భరత్ మాట్లాడుతూ.. జిల్లాలో వివిధ పట్టణ ప్రాంతాల్లో పారిశుధ్య పనులు ముమ్మరంగా జరుగుతున్నాయన్నారు. అధిక సంఖ్యలో నిధులు వెచ్చించి

- తరువాయి 2లో..

## చేయూత సేవలు
# అభినందనీయం

**-ఎంపీ ఉదయ్ శ్రీనివాస్**



**పిఠాపురం,మేజర్‌న్యూస్ :** చేయూత స్వచ్ఛంద సేవా సంస్థ చేపడుతున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్అన్నారు.అంతర్జాతీయ మహిళాదినోత్సవాన్ని పురస్క రించుకుని చేయూత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో గర్భిణీ మహిళలకు సంప్రదాయబద్ధంగా సీమంత వేడుకలు పిఠాపురం ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో శనివారం నిర్వహించారు. గర్భిణీ మహిళలకు చేయూత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా తయారు చేయించిన రూ.2 వేలు విలువైన పౌష్టికాహార కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. సమాజంలో అవసరమైన వారికి సహాయం చేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, పేదల కోసం, ముఖ్యంగా గర్భిణీ మహిళల సంక్షేమం కోసం నిర్వహించిన ఈ కార్యక్రమం ఎంతో ప్రశంసనీయమని తెలిపారు. రూ.1 లక్ష ఆర్థిక

- తరువాయి 2లో..

# ఆపరేషన్ 'వజ్రప్రహార్'లో భాగంగా 'మెగా కార్డన్ డే'





**రంపచోడవరం, మేజర్ న్యూస్ :** ఆపరేషన్ 'వజ్రప్రహార్'లో భాగంగా రంపచోడవరంలో 'మెగా కార్డన్ డే' శనివారం నిర్వహించారు. ఈ మెగా ఆపరేషన్‌ను చింతూరు ఏఎస్పీ, రంపచోడవరం ఇన్చార్జ్ ఎస్‌డిపిఓ బి. హేమంత్ ఆధ్వర్యంలో నిర్వహించారు.

రంపచోడవరం మండలం పెద బారంగి గ్రామంలో పోలీసు అధికారులు, సిబ్బంది విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. ఈ కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్‌లో భాగంగా మొత్తం 20 మంది పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. ముఖ్యంగా మాదకద్రవ్యాల వినియోగం జరుగు తున్నట్లు అనుమానం ఉన్న ప్రాంతాలు, అద్దె ఇళ్లు, ఖాళీ భవనాలు, అనుమానాస్పద ప్రదేశా లలో పోలీసులు సోదాలు నిర్వహించారు. ఈ ఆపరేషన్‌లో భాగంగా మొత్తం 250 మంది వ్యక్తులను, 20 వాహనాలను తనిఖీ చేశారు. సరైన పత్రాలు లేని 3 వాహనాలను గుర్తించి సీజ్ చేశారు.

చెడు నడత కలిగిన వ్యక్తులను పిలిపించి వారికి కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసులు ప్రజలకు మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనారోగ్యం, సామాజిక, చట్టపరమైన దుష్పరిణామాల గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో భాగంగా పోలీసు అధికారులు, సిబ్బంది ప్రజలతో కలిసి 'ఆపరేషన్ వజ్రప్రహార్ ప్రతిజ్ఞ' నిర్వహించి, మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా పోరాడాలని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో రంపచోడవరం సీఐ సన్యాసి నాయుడు, ఎస్ఐ వెంకటరావు, భూషణం, ఈగల్ సెల్ హెచ్‌సి పి.ఎం.ఎస్. రెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# సహాయ కమిషనర్‌గా జెఎన్టీయుకె పూర్వ విద్యార్థిని

**కాకినాడ,మేజర్‌న్యూస్ :** జేఎన్‌టీయూ కాకినాడలో యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ సివిల్ ఇంజినీరింగ్ విభాగంలో చదువుకున్న పూర్వ విద్యార్థిని జలాది రమ్యశ్రీ ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపిపిఎస్‌సి) నిర్వహించిన గ్రూప్-1పరీక్షలో ఉత్తీర్ణత సాధించి రాష్ట్ర పన్నుల విభాగంలో సహాయ కమిషనర్ పదవికి ఎంపికయ్యారు. పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెం మండలం పెదతాడేపల్లి గ్రామానికి చెందిన జలాది రమ్యశ్రీ ఈ విజయాన్ని సాధించారు. ఆమె తండ్రి జె.కుటుంబరావు స్కూల్ బస్ డ్రైవర్‌గా పనిచేస్తుండగా, తల్లి సునీత అంగన్‌వాడి కేంద్రంలో సేవలందిస్తున్నారు.జలాది రమ్యశ్రీ 2018-2021 మధ్యకాలంలో జేఎన్‌టీయూ కాకినాడ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్‌లో సివిల్ ఇంజినీరింగ్ (లేటరల్ ఎంట్రీ) ద్వారా బీటెక్ చదివారు. విద్యాభ్యాసంలో ఆమె ఎప్పటికప్పుడు మెరుగైన ప్రతిభ కనబరిచారు. పదవ తరగతిలో శ్రీరామ విద్యా నికేతన్ పాఠశాలలో 9.5 జిపిఏ (గ్రేడ్ పాయింట్ అవరేజ్) సాధించారు. అనంతరం గవర్నమెంట్ పాలిటెక్నిక్ ఫర్ ఉమెన్, కాకినాడలో డిప్లొమా చదివి 96.2 శాతం మార్కులు సాధించారు.

ఆమె 2025 సంవత్సరంలో నిర్వహించిన ఏపీపీఎస్సీ గ్రూప్-1 పరీక్షకు హాజరై విజయాన్ని సాధించారు. ఇది ఆమెకు రెండవ ప్రయత్నం కాగా, పట్టుదలతో కృషి చేసి లక్ష్యాన్ని సాధించడం విశేషం. భవిష్యత్తులో యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్‌లో కూడా విజయం సాధించాలని ఆమె లక్ష్యంగా పెట్టుకున్నారు.ఈ సందర్భంగా జలాది రమ్యశ్రీ మాట్లాడుతూ, "నా విజయానికి జేఎన్‌టీయూ కాకినాడ ముఖ్యమైన పాత్ర పోషించింది. ఈ సంస్థలో నేర్చుకున్న పట్టుదల, టీమ్‌వర్క్, సమయపాలన మరియు క్రమశిక్షణ నాకు ఈ విజయాన్ని అందించాయి. జేఎన్‌టీయూకే పూర్వ విద్యార్థినిగా ఉండటం నాకు గర్వంగా ఉంది" అని తెలిపారు. సందర్భ ంగా జేఎన్‌టీయూకే రెక్టర్ ప్రొఫెసర్ పి.సుబ్బారావు, వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎం.స్వరూపారాణి, సివిల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి ప్రొఫెసర్ కె.పద్మకుమారి, అలాగే విభాగ అధ్యాపకులు జలాది రమ్యశ్రీని అభినందించి ఆమె భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

# చేయూత సేవలు అభినందనీయం

మొదటిపేజి తరువాయి

సహాయాన్ని సంస్థ కు అందించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జే. నరసింహ నాయక్, ఎమ్మెల్సీ కర్రీ పద్మశ్రీ మాట్లాడుతూ... చేయూత సంస్థ ఆధ్వర్యంలో మహిళల సంక్షేమానికి చేస్తున్న కృషిని అభినందించారు. సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు మొండి రవికుమార్ మాట్లాడుతూ 120 మంది గర్భిణీలకు పౌష్టికాహార కిట్లను అందజేసినట్లు తెలిపారు. ఏడాది కాలం పాటు పిఠాపురం ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే పేద రోగులు, వారి బంధువులకు ఉచితంగా భోజనం అందించడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమం విజయవంతానికి సహకరించిన దాతలు, స్వచ్ఛంద సేవకులు, ఆసుపత్రి సిబ్బందికి నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు. చేయూత సంస్థ మహిళా అధ్యక్షురాలు తేజస్వి, అసోసియేట్ అధ్యక్షురాలు సుందరి, ఆర్గనైజింగ్ సెక్రటరీ మంజుల, వైస్ ప్రెసిడెంట్‌లు నాగ దేవి, సత్య కీర్తి, శ్రీ లక్ష్మి, సంస్థ ప్రధాన కార్యదర్శి, నారాయణ మూర్తి, ఉపాధ్యక్షుడు బాషా, పిఠాపురం నియోజకవర్గ కో ఆర్డినేటర్లు స్వామి,దొరబాబు, రాంబాబు, విజయ్, శ్రీ మాన్, సుబ్రహ్మణ్యం కార్యక్రమానికి నిర్వహణా బాధ్యతలు వహించారు. ఈ కార్యక్రమానికి ఆస్పత్రికి సూపర్ డెండెంట్ డాక్టర్ కీర్తీ ప్రియ, కూటమి నాయకులు పాల్గొన్నారు.

# లక్ష్మీగణపతి ఆలయంలో పెన్నుల పూజ



**బిక్కవోలు, మేజర్ న్యూస్ :** బిక్కవోలు గ్రామంలో వెలసిన స్వయంభూ శ్రీ లక్ష్మీగణపతి స్వామి వారి ఆలయంలో పెన్నుల పండుగ సందర్భంగా పెన్నులతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. హైదరాబా దుకు చెందిన ఆకెళ్ళ సూర్యనారాయణమూర్తి వారి సతీమణి పద్మావతి దంపతులు వారి కుటుంబ సభ్యుల ధాతృత్వంతో పెన్నుల పూజ ఘనంగా నిర్వహించారు. పదవ తరగతి పరీక్షలు సమీపిస్తున్న తరుణంలో స్వామివారి వద్ద పూజ చేసిన పెన్నులను తీసుకొని విద్యార్థులు పరీక్షలకు హాజరైతే ఉత్తమమైన ఫలితాలు వస్తాయని ప్రగాఢ నమ్మకం. పూజ చేసిన పెన్నులను భక్తులకు పంపిణీ చేస్తారు. ఈ కార్యక్రమానికి ఆలయ చైర్మన్ చాగంటి సాయిబాబారెడ్డి ఆధ్వర్యంలో ధర్మకర్తలు రెడ్డి ధనలక్ష్మి, రాయుడు అశోక్, కొడమంచిలి సూర్యలక్ష్మి, పడిపే రమణ, జంగం మంగ, దుమ్ము మహేష్, జంపా లక్ష్మి, జొన్నల వర్ధనమ్మ, అయినపర్తి పోసుబాబు తదితరులు పాల్గొన్నారు.

అర్చకులు కొడమంచిలి సత్యనారాయణ, గొల్లపల్లి చలపతి శర్మ వాళ్ల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీర్వాదాలు పొందారు. భక్తులకు ఏ విధమైన అసౌకర్యాలు కలకుండా ఆలయ కమిటీ వారు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

## హాస్టల్ విద్యార్థుల సంక్షేమం అంటే ఇదేనా?

మొదటిపేజి తరువాయి

వారు చేసుకుపోతున్నారన్నారు. గిరిజన సంక్షేమ హాస్టల్స్‌లో కనీస వసతులు పిల్లలకు అందించట్లేదన్నారు.హాస్టల్‌లో ఉండే బాలుర ఆరోగ్యంపై శ్రద్ధవహించట్లేదని, జ్వరంతో బాధపడుతున్న విద్యార్థిని చూసితెలుసుకున్నారు.తక్షణమే ఆబాలుడిని హాస్పిటల్‌కి పంపించే ఏర్పాటుచేసారు.వెంటనే అసిస్టెంట్ ట్రైబల్ వెల్ఫేర్ ఆఫీసర్ ను పిలిపించి తగిన జాగ్రత్తలు తీసుకోమని, హాస్టల్స్ ఈ విధంగా ఉంటే పిల్లలు ఎలా వస్తారన్నారు. ఇటువంటి స్థితిలో హాస్టల్ చూసి జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ మురళీ గంగాధరరావు అసహ నం వ్యక్తం చేసారు. గిరిజన విద్యార్థులకు సౌకర్యాలు సక్రమంగా ఉండేలా వెంటనే చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈకార్యక్ర మంలోన్యాయవాదులు ఏ.ఆర్.ఆర్.భగవాన్, లక్ష్మీనారాయణ, మారేడు మిల్లి యస్ఐ కె.శ్రీనివాసరావు,కోర్టు సూపరింటెండెంట్ నాగభూషణం,పాఠశాల అధ్యాపకురాలు ఉపాధ్యాయులు, పోలీసులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

## అక్రమ కేసులను ధైర్యంగా ఎదుర్కొంటాం

మొదటిపేజి తరువాయి

పాల్పడటం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని వారు మండిపడ్డారు.

**కార్యకర్తలకు భరోసా..** ఈ సందర్భంగా దాడిశెట్టి రాజా మాట్లాడుతూ.. అధికార బలంతో విపక్ష నేతల గొంతు నొక్కాలని చూడటం అవివేకమని అన్నారు. క్షేత్రస్థాయిలో పార్టీ కోసం పనిచేసే ప్రతి కార్యకర్తను కంటికి రెప్పలా కాపాడుకుంటామని, వైఎస్సార్‌సీపీ కుటుంబం సత్యనారాయణకు తోడుగా ఉంటుందని ప్రకటించారు. చట్టంపై తమకు నమ్మకం ఉందని, అక్రమ కేసులు నిలబడవని ఆయన ధీమా వ్యక్తం చేశారు. దవులూరి దొరబాబు మాట్లాడుతూ..రాజకీయంగా ఎదుర్కోలేకనే ఇలాంటి కుట్రలకు తెరలేపుతున్నారని విమర్శించారు.

**భారీగా తరలివచ్చిన శ్రేణులు..** సత్యనారాయణ పరామర్శ కార్యక్రమానికి పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు మరియు స్థానిక ప్రజాప్రతినిధులు భారీగా తరలివచ్చారు. నాయకుల రాకతో కార్యకర్తల్లో కొత్త ఉత్సాహం నెలకొంది.పార్టీ గొడుగు కింద అందరూ ఐక్యంగా ఉండి ఇలాంటి దాడులను తిప్పికొట్టాలని వారు పిలుపునిచ్చారు.ఈకార్యక్రమంలో నియోజకవర్గ స్థాయికీలకనేతలు, స్థానిక సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

## కాకినాడ నగరంలో స్వచ్ఛతపై ప్రజల్లో మార్పు అవసరం

మొదటిపేజి తరువాయి

కనెక్షన్ నిలిపివేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. శాంతనపురి కాలనీలో ఉన్న సామూహిక మరుగుదొడ్లను పరిశీలించిన కమిషనర్ అక్కడి పరిస్థితి అధ్వానంగా ఉండటంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. తక్షణమే మరుగుదొడ్లలో ఉన్న సమస్యలను పరిష్కరించి పరిసర ప్రాంతాలను పూర్తిగా శు భ్రపరచాలని అధికారులను ఆదేశించారు. అలాగే కాలనీలోని పలు వీధుల్లో కొంతమంది ప్రజలు రోడ్డుపై కట్టెల పొయ్యిలు పెట్టుకోవడం గమనించిన కమిషనర్ వాటిని కూడా వెంటనే తొలగింపజేశారు. కొందరు రోడ్డు పైనే అన్నం పారబోస్తున్నట్లు గుర్తించి వాటిని కూడా ప్రజల చేతనే ఎత్తించి డస్ట్‌బిన్‌లో వేయించారు. రోడ్డుపై ఆహార పదార్థాలు వేయకూడదని, అలాంటి చర్యలు పునరావృతమైతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఈ సందర్భంగా అక్కడి ప్రజలను అడిగి త్రాగునీటి సరఫరా సక్రమంగా జరుగుతుందా, వీధి దీపాలు వెలుగుతున్నాయా, పారిశుద్ధ్య కార్మికులు ప్రతిరోజూ వస్తున్నారా అనే విషయాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ ఎన్.వి.వి. సత్యనారాయణ మాట్లాడుతూ కాకినాడ నగరాన్ని క్లీన్ సిటీగా తీర్చిదిద్దడానికి ప్రజల భాగస్వామ్యం అత్యంత అవసరమని తెలిపారు. ముఖ్యంగా ఈ డివిజన్ ప్రజల్లో స్వచ్ఛతపై మరింత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని, ప్రజల్లో మార్పు రావాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో డీఈ ఫణీంద్ర, టిపిఎస్ రామ్మోహన్, శానిటేషన్ సూపర్వైజర్ నాయుడు, శానిటేషన్ ఇన్స్పెక్టర్ దుర్గారావు, సచివాలయ సిబ్బంది, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పారిశుద్ధ్య పనులను పరిశీలించిన జాయింట్ కలెక్టర్

మొదటిపేజి తరువాయి

జిల్లాలోని అన్ని పట్టణ ప్రాంతాల్లో ప్రత్యేక పరిశుద్ధ కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని, ప్రజలు తిరిగి ఆ ప్రదేశాలను పాడు చేయకుండా అధికారులు పటిష్ట చర్యలు చేపట్టాలన్నారు. ఆయా ప్రదేశాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి, శుభ్రం చేసిన ప్రదేశాల్లో మరల చెత్తవేసే వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని జేసి అధికారులను ఆదేశించారు. ఈ పరిశీలనలో జేసీ వెంట ఎంహెచ్ఓ డా. పృథ్వీ చరణ్, శానిటరీ ఇన్స్పెక్టర్ ధర్మరాజు, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పాఠ్యాంశంగా అవయవ దానం

– డాక్టర్ సానా ప్రవీణ్



**కాకినాడ,మేజర్‌న్యూస్ :** ఒకరి అవయవ దానం ద్వారా 8 మంది ప్రాణాలను నిలబెట్టడానికి ఎంతో అవకాశం ఉంటుందని ట్రస్ట్ హాస్పిటల్ ప్రముఖ నెఫ్రాలజిస్ట్ డాక్టర్ ప్రవీణ్ సాన అన్నారు. రోటరీ గోల్డెన్ జూబ్లీ క్లబ్ సమావేశం క్లబ్ అధ్యక్షులు డాక్టర్ గోపీనాథ్ అధ్యక్షతన రోటరీ సమావేశ మందిరంలో జరిగింది. తొలుత రోటరీ అసిస్టెంట్ గవర్నర్ అప్పసాని కృష్ణకుమారి జ్యోతి ప్రజ్వలన చేసి వాటర్ శానిటేషన్ మరియు హైజనిక్ (వాష్) మాసోత్సవాలను లాంచనంగా ప్రారంభించారు.

ముఖ్యఅతిథిగా డాక్టర్ ప్రవీణ్ మాట్లాడుతూ ట్రాన్స్ ప్లాంటేషన్‌లో ప్రపంచంలోనే మూడవ స్థానంలో భారతదేశం ఉందని ఆయన చెప్పారు. ఆర్గానిక్ డొనేషన్ మరియు బ్రెయిన్ డెత్ అంశాలపై పాఠశాల మరియు కళాశాల స్థాయిలో పాఠ్యాంశాలుగా తీసుకురావడం వల్ల నేటి తరానికి వీటి విలువపై అవగాహన కలగడానికి ఎక్కువ అవకాశం ఉంటుందని, ప్రభుత్వాలు పరిశీలించాల్సిందిగా ఆయన విజ్ఞప్తి చేశారు. అవయవ దానం చేసిన వారి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వడానికి కూడా వున్న అవకాశాలను ప్రభుత్వం చర్చల స్థాయిలో ఉండడం త్వరలో అది అమలు జరిగితే సమాజానికి ఎంతో ప్రయోజనం చేకూరుతుందన్న అభిప్రాయాన్ని డాక్టర్ సానా ప్రవీణ్ వ్యక్తం చేశారు. అవయవాదానం చేసిన వారి కుటుంబానికి ఆర్థిక పరిహారాన్ని కూడా అందించే ఆలోచనలో ప్రభుత్వం ఇటీవల ఆరోగ్య సమీక్ష సమావేశంలో ప్రస్తావ-నకు రావడం శుభ పరిణామం అన్నారు. క్లబ్ అధ్యక్షులు డాక్టర్ గోపీనాథ్ మాట్లాడుతూ అవయవ దానం విషయంపై ప్రభుత్వం కూడా ప్రత్యక శ్రద్ధ తీసుకోవాల్సిన అవసరం ఉందని, దానివల్ల సామాన్యులు కూడా మేలు జరిగే అవకాశం ఉందని అన్నారు. అవయవదానంపై ప్రభుత్వ ఆధ్వర్యంలో రాష్ట్రంలో మూడు ప్రాంతాల కేంద్రంగా హాస్పిటల్స్ ను ప్రభుత్వం ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. సామాన్యులు కూడా అవయవ దానం ద్వారా లబ్ధి పొందుతారని చెప్పారు.అవయవ దానంపై సమగ్రంగా విశ్లేషణాత్మకంగా సుదీర్ఘంగా ప్రసంగించిన డాక్టర్ సానా ప్రవీణ్‌ను రోటరీ అసిస్టెంట్ గవర్నర్ అప్పసాని కృష్ణకుమారి చేతుల మీదుగా ఘనంగా సత్కరించి జ్ఞాపిక అందచేశారు. కార్యక్రమంలో కోశాధికారి ఉదయ్ చక్రవర్తి, డాక్టర్ సతీష్, చోడిశెట్టి పద్దరాజు, లంక సాయిబాబు, మాజేటి పవన్, ఠాగూర్, చందు, పరశురాం, బుజ్జి తో పాటు పలువురు పాల్గొన్నారు.

# మహిళా సాధికారత కార్యక్రమంలో ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులు




కాకినాడ, మేజర్ న్యూస్ : స్థానిక సాంబమూర్తి నగర్‌లో గల ఆదిత్య మహిళా డిగ్రీ మరియు పి.జి. కళాశాలలో (ఎ) 'అంతర్జాతీ మహిళా దినోత్సవ' వేడుకలు పురస్కరించుకుని కాకినాడ పోలీసు విభాగం బానుగుడి జంక్షన్‌లో నిర్వహించిన మహిళా సాధికారత కార్యక్రమంలో తమ కళాశాల విద్యార్థినులు పాల్గొన్నారని ప్రిన్సిపాల్ కె.కరుణ తెలిపారు. ఈ సందర్భంగా ఆదిత్య డిగ్రీ మరియు పి.జి. కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డా॥ బి.యి.వి.యల్ నాయుడు మాట్లాడుతూ మహిళ తన కర్తవ్యాలను, భాద్యతలను నిర్వహించి, అటు సంఘంలోను ఇటు ఉద్యోగంలోనూ తన ప్రతిభను కనపరుస్తున్న మహిళలకు మనం ఇచ్చే ఘన సత్కారం ఇలాంటి వేడుకలే అని ఆయన అభిప్రాయపడ్డారు.ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ కె.కరుణ మాట్లాడుతూ కాకినాడ పోలీసు విభాగం వారిచే మహిళా సాధికారత మరియు వారు వివిధ కార్యక్రమాలలో వాయించే బ్యాండ్ రీతులను కార్యక్రమంలో హజరైన కళాశాల విద్యార్థినులు మరియు స్కూల్ విద్యార్థులకు తెలియపరిచారు. ఈ కార్యక్రమంలో జిల్లా పోలీసు అధికారులు, ట్రాఫిక్ అధికారులు మరియు యంత్రాంగం పాల్గొన్నారని తెలిపారు. తమ కళాశాలకు చెందిన విద్యార్థినులు అధిక సంఖ్యలో పాల్గొని మహిళా సాధికారతకు అర్థం తెలియచేసారని అన్నారు.ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ జి.నాగ శ్రీకాంత్ మాట్లాడుతూ మహిళల హక్కులు, సాధికారత, సమానత్వం కోసం శతాబ్దాలుగా సాగుతున్న పోరాటంలో అసువులు బాసిన, పోరాడుతున్న మహిళామణుల స్ఫూర్తిని ఇదే రోజున స్మరించుకుంటామని ఆయన అన్నారు.ఈ సందర్భంగా కళాశాల ఎన్.ఎస్.ఎస్. ప్రోగ్రాం ఆఫీసర్ పి.సురేఖ దేవి, 3 టౌన్ పోలీస్ అధికారులు, ట్రాఫిక్ అధికారులు, విద్యార్థినులు మరియు వాలంటీర్లు పాల్గొన్నారు.



# వైసీపీ సీనియర్ నాయకుడు గోపాల్ రాజు మృతి

**ఆత్రేయపురం, మేజర్ న్యూస్ :** ఆత్రేయపురం గ్రామానికి చెందిన వైసిపి సీనియర్ నాయకులు ప్రముఖ కొబ్బరికాయల వ్యాపారవేత్త వేగేశ్న గోపాల్ రాజు (65) శనివారం గుండెపోటుతో మృతి చెందారు. జిల్లా వైఎస్ఆర్సిపి అధ్యక్షులు చిర్ల జగ్గిరెడ్డికి ఈయన ముఖ్య అనుచరుడు. ఈయన మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

ఈయన మృతి చెందిన సంగతి తెలుసుకున్న వెంటనే చిర్ల జగ్గిరెడ్డి హుటాహుటిన ఆత్రేయపురం చేరుకుని గోపాలం పార్థివ దేహానికి నివాళులు అర్పించారు. ఆయన మృతి పట్ల నాయకులు చిలువూరి రామకృష్ణంరాజు, బాబి రాజు, ముదునూరి రామరాజు, పివిస్ రాజు, ముదునూరి కృష్ణంరాజు, గొట్టుముక్కల గోపిరాజు, పచ్చమట్ల గోపాల్ రాజు, బసవయ్య, నియోజకవర్గ నాయకులు సంతాపం వ్యక్తం చేశారు.

# జనసంద్రంగా వాడపల్లి క్షేత్రం భక్తవత్సలుడుకు భక్తుల నీరాజనాలు





**ఆత్రేయపురం, మేజర్ న్యూస్ :** కలియుగ వైకుంఠం కోనసీమ తిరుమల వాడపల్లి వెంకటేశ్వర స్వామివారికి శనివారం భక్తులు నీరాజనాలు సమర్పించారు. ఉదయం వేకువజామునే సుప్రభాత సేవ అనంతరం స్వామివారికి నీరాజనం మంత్రపుష్పం తదితర పూజా కార్యక్రమాలు అర్చక స్వాములు అంగరంగ వైభవంగా నిర్వహించి తనంతరం భక్తులకు దర్శనాలు కల్పించారు. రాష్ట్ర నలుమూల నుండి కాలినడకన వచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణమంతా కిక్కిరిసి పోయింది. వచ్చిన భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చైర్మన్ ముదునూరి వెంకటరాజు, డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధర్ రావులు ఏర్పాటును పూర్తి చేసి పర్యవేక్షించారు. ప్రసాద వితరణ అన్నదానం నిర్వహించారు. ఆర్టీసీ అధికారులు సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఏలేశ్వరం, ఏలూరు, రాజమహేంద్రవరం, గోకవరం, విజయవాడ, విశాఖపట్నం నుండి ప్రత్యేక బస్సులు నడిపారు. వచ్చిన భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా సీఐ విద్యాసాగర్ ఎస్సై ఎస్.రాము తన సిబ్బందితో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. స్వామివారి ఆదాయం రూ.60 లక్షలు సమకూరింది.

# శ్రీ సత్యదేవుని దర్శించుకున్న తెలుగు రచయిత సుభాష్ చంద్రబోస్



**అన్నవరం, మేజర్ న్యూస్ :** ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ వీర వెంకట సత్య నారాయణ స్వామివారి దర్శనార్థం తెలుగు రచయిత సుభాష్ చంద్రబోస్ దంపతులు సన్నిధికి విచ్చేశారు. ముందుగా ఆలయ అధికారులు స్వాగతం పలికారు. అనంతరం శ్రీ స్వామి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజ నిర్వహించారు. దర్శనానంతరం వేద పండితులు వేద ఆశీర్వచనం అందించగా, దేవస్థానం అధికారులు శేష వస్త్రం, శ్రీ స్వామివారి ప్రసాదం అందజేశారు.

## జగ్గిరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన పాముల రాజేశ్వరి



**రావులపాలెం, మేజర్ న్యూస్ :** రాజోలు నియోజకవర్గ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నూతన ఇంచార్జిగా బాధ్యతలు స్వీకరించిన పాముల రాజేశ్వరిదేవి శనివారం డా. బి.ఆర్. అంబేద్కర్ కొనసీమ జిల్లా వైసీపీ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డిని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాజేశ్వరి జగ్గిరెడ్డికి బొకే అందజేసి, శాలువాతో ఘనంగా సత్కరించారు. అనంతరం జగ్గిరెడ్డి కూడా రాజేశ్వరిని శాలువా పూలమాలతో సత్కరించి, అభినందనలు తెలియజేసారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అందరూ కలిసికట్టుగా రాజోలులో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జెండాను విజయపదంలో నడిపించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ పార్టీ ముఖ్య నేతలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సూర్య
www.suryaa.com
మీరు చందాదారులుగా చేరాలనుకుంటున్నారా..
సకాలంలో పేపరు అందడం లేదా...
సంప్రదించండి సెల్ : 9989800678
అతి తక్కువ ఖర్చుతో పుట్టినరోజు, వివాహ వేడుక, పదవీ విరమణ,
ప్రారంభోత్సవం, శ్రద్ధాంజలి, పేరు మార్పు, లీగల్ ప్రకటనలకు,
మీ కార్యక్రమాలకు సంబంధించిన వార్తలు ఏవైనా సరే
సంప్రదించండి. సెల్ : 9032209779

# అన్నవరంలో వైభవంగా మండపం నూకాలమ్మవారి గరగల మహోత్సవం





- అత్తి కుటుంబ వంశపారంపర్య సంప్రదాయం ప్రత్యేక ఆకర్షణ
- భక్తిశ్రద్ధలతో మొక్కులు తీర్చుకున్న భక్తులు మరియు విద్యార్థులు

**అన్నవరం, మేజర్ న్యూస్ :** ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నవరం గ్రామంలో దశాబ్దాలుగా వస్తున్న ఆనవాయితీని పురస్కరించుకుని, శ్రీశ్రీశ్రీ మండపం నూకాలమ్మవారి గరగల మహోత్సవం శనివారం అత్యంత భక్తిశ్రద్ధలతో, వైభవంగా నిర్వహించబడింది. కొత్త అమావాస్యకు ముందు మండపం గ్రామం నుండి అమ్మవారి గరగలు అన్నవరం విచ్చేయడం ఒక పవిత్ర ఆధ్యాత్మిక సంప్రదాయంగా కొనసాగుతోంది. అత్తి కుటుంబ వంశపారంపర్య సేవలు అన్నవరం గ్రామ ప్రజలు అమ్మవారిని "అత్తి వారి ఆడపడుచు"గా భావించి ఆరాధిస్తారు. ఈ క్రమంలో, అత్తి కుటుంబ సభ్యులు అమ్మవారికి పసుపు, కుంకుమ, చీరలు, చలివిడి, వడపప్పు వంటి నైవేద్యాలను సమర్పించి సంప్రదాయ బద్ధంగా ఆహ్వానించారు. అత్తి కుటుంబం ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం మాత్రమే అమ్మవారు గ్రామంలోకి ప్రవేశించడం ఈ ఉత్సవంలో ప్రధాన ఘట్టం.

ఉత్సవ విశేషాలు:ఉదయం 11:00 గంటల నుండి మధ్యాహ్నం 3:00 గంటల వరకు ఆంధ్ర బ్యాంక్ నుండి రైల్వే స్టేషన్ మార్గం మీదుగా రావిచెట్టు సెంటర్ వరకు ఈ శోభాయాత్ర సాగింది. భక్తులు అమ్మవారి ప్రతిరూపమైన గరగను తమ ఇళ్లకు ఆహ్వానించి పాన్పులు వేసి పూజలు నిర్వహించారు. మహిళలు 5, 7, 9 బిందెల పసుపు నీళ్లతో అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు.

విద్యార్థుల సందడి: పరీక్షల సమయం కావడంతో విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకోవడం విశేషం.

సేవా కార్యక్రమాలు రాత్రి వేళ రావిచెట్టు సెంటర్ వద్ద తప్పెట గుళ్ళు, గరగలాట, చిరుతల ఆటలు మరియు ఆర్కెస్ట్రా వంటి కార్యక్రమాలు భక్తులను అలరించాయి.

ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు మజ్జిగ, లస్సీ, మంచినీరు పంపిణీ చేయగా, పలువురు భక్తులు స్వచ్ఛందంగా పులిహోర ప్రసాద వితరణ చేశారు. ఈ ఉత్సవం విజయవంతం కావడానికి సహకరించిన గ్రామ పెద్దలకు, అన్నవరం పోలీస్ సబ్ ఇన్‌స్పెక్టర్ మరియు సిబ్బందికి, అత్తి కుటుంబ సభ్యులకు, అలాగే కొండి, మాదన కుటుంబ సభ్యులకు ఉత్సవ కమిటీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేసింది. ఈ వేడుక కులమతాలకు అతీతంగా గ్రామ ఐక్యతకు ప్రతీకగా నిలిచింది.

# రిపోర్టర్ సతీష్‌కు ఆర్థిక సాయం అందించిన కొత్తపేట టిడిపి నేతలు



**రావులపాలెం, మేజర్ న్యూస్ :** అనారోగ్యంతో బాధపడుతున్న విలేకరి సతీష్‌ను కొత్తపేట టిడిపి నాయకులు ధర్నాల రామకృష్ణ, కంఠంశెట్టి శ్రీనివాసురావు, గుబ్బల మూర్తి ఈతకోట స్వగృహంలో కలిసి పరామర్శించారు. అనారోగ్యానికి గురై రాజమండ్రి ఆసుపత్రిలో చికిత్స తీసుకుని ఈతకోటలోని వారి స్వగృహంలో విశ్రాంతి తీసుకుంటున్న సతీష్ ను పలకరించి ఆర్థిక సహాయం అందించారు. అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్న సతీష్‌కు మెరుగైన వైద్యం అందించవలసి ఉన్నది.

అతని యొక్క ఆర్థిక పరిస్థితి దృష్ట్యా టిడిపి నేతలు ఆర్థిక సహాయం అందించారు.

# ఆపరేషన్ వజ్రప్రహార్

- ఎస్పీ ఆదేశాల మేరకు రావులపాలెంలో కార్డ్ అండ్ సర్చ్



**రావులపాలెం మేజర్ న్యూస్ :** రాష్ట్ర డిజిపి హరీష్ కుమార్ గుప్త ఆదేశాల మేరకు ఈగల్ చీఫ్ ఆర్కే రవి కృష్ణ సూచనలతో డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ కొనసీమ జిల్లా ఎస్పీ రాహుల్ మీనా ఆధ్వర్యంలో కొత్తపేట సబ్ డివిజన్ పోలీస్ అధికారి సుంకర మురళి మోహన్ పర్యవేక్షణలో మెగా కార్డ్ అండ్ సర్చ్ ఆపరేషన్‌ను రావులపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో గల చిర్ల సోమసుందర రెడ్డి కాలనీలో శనివారం తెల్లవారు జామున నిర్వహించారు. 50 మంది పోలీసు అధికారులు మరియు సిబ్బంది, ఈగల్ స్పెషల్ టీమ్‌లు కలిసి గుర్తించిన హాట్‌స్పాట్ ప్రాంతమైన చిర్ల సోమసుందర రెడ్డి కాలనీ మరియు మాదకద్రవ్యాల వినియోగం జరుగుతున్నట్లు అనుమానం ఉన్న ప్రాంతాలు, అద్దె ఇళ్లు, చిన్న లాడ్జీలు, ఖాళీ భవనాలు, బస్ స్టాండ్లు, మరియు ఇతర అనుమానాస్పద ప్రదేశాలలో మరియు పాత గంజాయి మరియు నార్కోటిక్ కేసులలో ఉన్నటువంటి ముద్దాయిలను గురించి పోలీసు వారు విస్తృతంగా సోదాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించి ప్రజల వివరాలు, వాహనాల వివరాలు మరియు అనుమానాస్పద వ్యక్తులపై పరిశీలన చేపట్టారు. ఈ ఆపరేషన్‌లో భాగంగా మొత్తం 150 మంది వ్యక్తులను, 58 వాహనాలను తనిఖీ చేశారు. సరైన పత్రాలు లేని 9 వాహనాలను గుర్తించారు. రౌడీ షీటర్లు మరియు సస్పెక్ట్ షీట్లు ఉన్న వ్యక్తులను స్పాట్ లో పిలిపించి వారికి కౌన్సెలింగ్ నిర్వహించి, సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. ఈ సందర్భంగా కొత్త పేట డిఎస్పి సుంకర మురళి మోహన్ ప్రజలకు మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనారోగ్య, సామాజిక మరియు చట్టపరమైన దుష్పరిణామాల గురించి అవగాహన కల్పించారు. గంజాయి మరియు ఇతర మాదకద్రవ్యాల వినియోగం యువత భవిష్యత్తును నాశనం చేస్తుందని, కుటుంబ వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతుందని వివరించారు. ప్రజలు తమ పరిసర ప్రాంతాల్లో గంజాయి లేదా ఇతర మాదకద్రవ్యాలకు సంబంధించిన సమాచారం ఉంటే వెంటనే ఏపీ ఈగల్ టోల్ ఫ్రీ నెంబర్ 1972 కు సమాచారం అందించాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు. సమాచారం ఇచ్చే వారి వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబడతాయని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో భాగంగా కొత్త పేట డిఎస్పి సుంకర మురళి మోహన్ పోలీసు, రావులపాలెం టౌన్ సిఐ ఎమ్.శేఖర్ బాబు, రావులపాలెం టౌన్ ఎస్ఐ చంటి, పి.గన్నవరం ఎస్ఐ శివ కృష్ణ, రాజోలు ఎస్ఐ రాజేష్ కుమార్ మరియు కొత్తపేట సబ్ డివిజన్ పోలీస్ సిబ్బంది మరియు ప్రజలతో కలిసి "ఆపరేషన్ వజ్రప్రహార్ ప్రతిజ్ఞ" నిర్వహించి మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా పోరాడాలని ప్రతిజ్ఞ చేశారు. సమాజాన్ని డ్రగ్స్ రహితంగా మార్చడంలో ప్రజల సహకారం ఎంతో ముఖ్యమని ఈ సందర్భంగా అధికారులు పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మాదకద్రవ్యాల వ్యాప్తిని పూర్తిగా అరికట్టే దిశగా "ఆపరేషన్ వజ్రప్రహార్" కింద ఇలాంటి ప్రత్యేక చర్యలు నిరంతరం కొనసాగుతాయని పోలీసులు తెలిపారు. ప్రజల సహకారంతో డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మించడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.

## గిరిజన మహిళ కుటుంబానికి న్యాయం చేయాలి



**రంపచోడవరం, మేజర్ న్యూస్ :** గిరిజన మహిళ (మృతురాలు) బాపనమ్మ కుటుంబానికి న్యాయం జరగాలని, వైద్యులపై చర్యలకు ఆదేశించాలని ఎస్టీ కమిషన్ చైర్మన్‌కు ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజ శ్రీను వినతి పత్రాన్ని అందజేశారు. శనివారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర షెడ్యూల్ తెగల కమీషన్ చైర్మన్ చోళ్ళ బొజ్జి రెడ్డిను కలిసి రంపచోడవరం ఏరియా ఆసుపత్రి వైద్య సిబ్బంది కారణంగా మృతి చెందిన బాపనమ్మ భర్త రాజన్నదొర కుటుంబానికి న్యాయం చేయాలన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత అక్టోబర్ 10వ తేదీన రంపచోడవరం మండలం నర్సాపురం గ్రామానికి చెందిన కోటం బాపనమ్మ ప్రసవం కోసం ఏరియా ఆసుపత్రిలో జాయిన్ అవ్వడం జరిగిందన్నారు. గిరిజన మహిళ బాపనమ్మ వైద్యుల నిర్లక్ష్యం కారణంగా అక్టోబర్ 20న మృతి చెందిందని, ఆమెకు పుట్టిన శిశువు మృతి చెందిందని తెలిపారు. మాత శిశు మరణాలకు వైద్యుల నిర్లక్ష్యమే కారణమని, దీనిపై పలు మార్లు ఐటీడీఏ, జిల్లా కలెక్టర్ గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేసామన్నారు. అదేవిధంగా ఈమరణాలపై జాతీయ షెడ్యూల్ తెగల కమిషన్‌కు, జాతీయ మానవ హక్కుల కమిషన్‌కు, రాష్ట్ర షెడ్యూల్ తెగల కమిషన్‌కు ఫిర్యాదు చేసామని తెలిపారు. ఆయా కమిషన్‌లు నుండి జిల్లా అధికారులకు నోటీసులు వచ్చినప్పటికీ ఇప్పటివరకు బాపనమ్మ కుటుంబానికి ఎటువంటి న్యాయం చేయలేదన్నారు. మాతా శిశు మరణాలకు కారకులైన వైద్యులపై ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు. కాబట్టి దీనిపై చర్యలకు ఆదేశించాలని, అదేవిధంగా మృతురాలు బాపనమ్మ కుటుంబానికి న్యాయం చేయాలని కోరడం జరిగింది. దీనిపై స్పందించిన చైర్మన్ న్యాయం చేస్తామని తెలియజేసారని కుంజ శ్రీను పేర్కొన్నారు.

## హాస్టల్ పరిసరాల పరిశుభ్రతపై దృష్టి సారించాలి

- జ్యూడిషయల్ మేజిస్ట్రేట్ మురళీ గంగాధరరావు





**రంపచోడవరం, మేజర్ న్యూస్ :** ఏజెన్సీ ప్రాంతాల్లోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు, హాస్టల్స్‌లో పరిసరాలు పరిశుభ్రతపై పాఠశాల నిర్వాహకులు జాగ్రత్తలు తీసుకోవాలని రంపచోడవరం మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జ్యూడిషయల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ యం.మురళీ గంగాధరరావు సూచించారు. రంపచోడవరం జ్యూడిషయల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ మురళీ గంగాధరరావు ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మారేడుమిల్లి మండలం బోదులూరు ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలలో శనివారం న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రాజ్యాంగ అవతరణ, దాని విలువలు, గొప్పతనం, ప్రాథమిక విధులు, బాలికలకు బాల్య వివాహాల చట్టలు, బాల కార్మిక చట్టాలు, పోక్సో చట్టంశ్రీ, గుడ్ టచ్ బాడ్ టచ్, ట్రైబల్ చట్టాలపై అవగాహన కల్పించారు. అంతేకాకుండా విద్యా హక్కుల చట్టల గురించి వారికి అర్థమయ్యేరీతిలో తెలియజేసారు. అదే పాఠశాలలో హాస్టల్ సందర్శించి వసతులను మేజిస్ట్రేట్ పరిశీలించారు. హాస్టల్ లో వంటగది, స్టోరేజ్ రూమ్, డైనింగ్ హాల్ నిర్వహణపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేసారు. హాస్టల్ సదుపాయాలు పిల్లలను దృష్టిలో ఉంచుకుని మార్పులు చేయాలని ఆదేశించారు. ఇదే విధంగా ఉంటే విద్యార్థులు అనారోగ్య సమస్యలకు గురయ్యే అవకాశం ఉందన్నారు. హాస్టల్ పరిసరాలు పరిశుభ్రతపై దృష్టి సారించాలని, పిల్లల ఆరోగ్యంపై ప్రభావం చూపేవిధంగా ఉండకూడదని, ముందస్తు చర్యలు తీసుకోవాలని సిబ్బందికి తెలిపారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు ఏ.ఆర్.ఆర్. భగవాన్, డి.లక్ష్మీనారాయణ, మారేడుమిల్లి యస్.ఐ. కె.శ్రీనివాస రావు, కోర్టు సూపరింటెండెంట్ నాగభూషణం, పాఠశాల అధ్యాపకురాలు, ఇతర ఉపాధ్యాయులు, పోలీసులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

# మన భాషను మనమే పరిరక్షించుకోవాలి... భావితరాలకు ఆదర్శం కావాలి

– సిదం అర్జు



**చింతూరు, మేజర్ న్యూస్ :** మన భాష ను మనమే పరిరక్షించుకోవాలని భావితరాల వారికి ఆదర్శం కావలసిన ఆవశ్యకత ఎంతైనా ఉందని తెలంగాణ రాష్ట్రం రాజ్ గోండ్ సేవా సమితి రాష్ట్ర కన్వీనర్ సిడం అర్జు పేర్కొన్నారు. పోలవరం జిల్లా చింతూరు మండలంలోని రామన్నపాలెం గ్రామంలో శనివారం పూనెం బాబురావు అధ్యక్షతన జరిగిన రజితోత్సవ కార్యక్రమంలో కోయత్తోర్ బాట బాల సాహిత్య సమన్వయ కర్త యాదయ్య పాల్గొని ప్రసంగిస్తూ కోయ భాషను భావితరాల వారికి అందించటానికి కోయత్తోర్ బాట గత 25 ఏళ్లుగా ఎంతో కృషి చేస్తుందని ప్రశంసించారు. ఈ సందర్భంగా కోయ రచయితలు దుమ్మిరి భీమమ్మ, తెల్లం కృష్ణ, బొక్కిలి నాగేశ్వరరావు రచించిన విజ్జ, అలింబిలం కోటై, గాలి గాలి కుక్కు, అనే మూడు పుస్తకాలను అతిథులందరూ ఆవిష్కరించారు. వార్త పత్రిక పూర్వ సంపాదకులు టంకశాల అశోక్ మాట్లాడుతూ కోయ భాష అంతరించిపోయే ప్రమాదంలో ఉంది కావున తమ భాష పరిరక్షణకు గిరిజన విద్యాధికులందరు కృషి చేయాలని, సాంప్రదాయాలను పరిరక్షించుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని పేర్కొన్నారు. కేంద్రీయ విశ్వవిద్యాలయం ఆంత్రపాలజీ ప్రొఫెసర్ శివప్రసాద్ మాట్లాడుతూ కోయత్తోర్ బాట గత 25 ఏళ్లుగా డ్రాప్ అవుట్ విద్యార్థులకు మార్గదర్శిగా నిలిచి ఉన్నత చదువులకు వెళ్లడానికి ఎంతగానో కృషి చేసిందని, వారి కృషి మరువలేనని కొనియాడారు. ఈ సందర్భంగా సమత స్వచ్ఛంద సంస్థ బాధ్యులు రెబ్బప్రగడ రవి మాట్లాడుతూ 5 షెడ్యూల్ ప్రకారం ఏజెన్సీలోని బాక్సైట్ లాంటి ఖనిజాలను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత గిరిజనులపై ఎంతగానో ఉందని ఆ దిశగా ముందుకు వెళతారని ఆశాభావం వ్యక్తం చేశారు. అలాగే కోయ బాలసాహిత్యాన్ని అన్ని గిరిజన ప్రాంతాలకు విస్తరించాలని కోరారు. కోయ రచయిత్రి కుంజా కళ్యాణి మాట్లాడుతూ తాను కోయ భాషలో కవిత్వం నేర్చుకోవడానికి కోయత్తోరు బాటకు వచ్చి నేర్చుకుంటానని, తద్వారా గిరిజనులకు భాష పెంపొందించేందుకు తోడ్పడుతానని పేర్కొన్నారు. ఎం.వి. ఫౌండేషన్ జాతీయ కన్వీనర్ వెంకటరెడ్డి మాట్లాడుతూ కోయత్తోర్ బాట గత 25 సంవత్సరాలుగా చేసిన సేవలు మరువరానివని, డ్రాప్ అవుట్ విద్యార్థులకు ఎంతగానో సేవ చేసిందని పేర్కొన్నారు. సికింద్రాబాద్ వృద్ధాశ్రమం నిర్వాహకులు ఫాదర్ పీటర్ డానియల్ మాట్లాడుతూ తనకు కోయత్తోర్ బాటకు ఉన్న సంబంధ బాంధవ్యాలను గుర్తుకు తెచ్చుకొని చేసిన సేవలను కొనియాడారు. కోయత్తోర్ బాట పూర్వ అకడెమిక్ సమన్వయ కర్త డాక్టర్ పాండు మాట్లాడుతూ తాను 25 సంవత్సరాలుగా కోయతోర్ బాటకు ఉన్న అనుబంధాన్ని, విద్యార్థులకు నేర్పిన పాఠాలను గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో చిన్న పిల్లలు పాడి వినిపించిన పాటలు బాల గేయాలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. చింతూరు కోయ యువతీ యువకులు చేసిన రేల నృత్యంను పలువురు వక్తలు ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్ద పటేలు బ్రహ్మయ్య, అధ్యక్షులు వెంకటలక్ష్మి తదితర గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# ఏ.వి.ఆర్. చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు

**ఆత్రేయపురం,మేజర్‌న్యూస్ :** ఆత్రేయపురం కాలువ రేవులో ఏ.వి.ఆర్. చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మజ్జిగ చలివేంద్రాన్ని వాడపల్లి వెంకటేశ్వర స్వామివారి దేవస్థానం చైర్మన్ ముదునూరి వెంకటరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏవీఆర్ ట్రస్ట్ సేవలు అభినందనీయం అన్నారు. భక్తులకు దాహార్తిని తీర్చే విధంగా దారి పొడవునా ఇలాంటి చలివేంద్రాలు దాతల సహాయంతో ఏర్పాటు చేస్తామని, వేసవికాలం ప్రారంభం అవడంతో వాడపల్లి భక్తులకు ఇబ్బంది కలగకుండా దాహార్తిని తీర్చే విధంగా ఈ మజ్జిగ చలివేంద్రం ప్రతీ శనివారం ఏర్పాటు చేస్తామని ట్రస్ట్ ఫౌండర్ & చైర్మన్ అల్లం వరప్రసాద్ తెలియజేశారు.




# ట్రాఫిక్‌తో బొబ్బర్లంక రావులపాలెం రోడ్డు విలవిల







**– వెంకన్న ఆలయానికి వచ్చే భక్తులు నానా అవస్థలు**

**– ట్రాఫిక్‌లో చిక్కుకుని, అత్యవసర చికిత్స అందక వ్యక్తి మృతి**

**– ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, ఆక్రమణలు తొలగింపుపై సత్వర చర్యలు గైకొనాలని ప్రజల విజ్ఞప్తి**

**ఆత్రేయపురం, మేజర్ న్యూస్ :** శనివారం వచ్చిందంటే చాలు అమలాపురం బొబ్బర్లంక రోడ్డు ట్రాఫిక్‌తో విలవిలలాడుతోంది. ముఖ్యంగా వాడపల్లి దేవస్థానం ఆలయానికి వందలాది బస్సులతో పాటు వేలాది వాహనాలు వస్తుండడంతో ట్రాఫిక్ సమస్య జటిలింగా మారింది. దీంతో భక్తులు నానా అవస్థలు పడవలసి వస్తుంది. దీనికి కారణం రావులపాలెం నుండి బొబ్బర్లంక వరకు రాష్ట్రీయ రహదారి ఇరుపక్కల ఉన్న ఆక్రమణలే ప్రధాన కారణమని తెలుస్తోంది. ఆక్రమణలు తొలగించడానికి అధికారులు మీనమేశాలు లెక్కిస్తున్నారు. ట్రాఫిక్‌తో పాటు రహదారి ఇరుకుగా ఉండడంతో ప్రమాదాలు కూడా తరచూ చోటు చేసుకుంటున్నాయి. పలువురు మృత్యువాత పడుతున్న సందర్భాలు ఎన్నో ఉన్నాయి. ఈ విషయంలో ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టి సారించాల్సి ఉంది. లేకుంటే భవిష్యత్తులో అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి ఉంటుందనుటలో ఎటువంటి సందేహం లేదు. ఆ దిశగా చర్యలు చేపట్టాల్సి ఉంది లేకుంటే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదు. శనివారం ఉదయం ఆత్రేయపురం గ్రామానికి చెందిన కొబ్బరి వ్యాపారి వేగేశ్న గోపాలరాజు అనే వ్యక్తి గుండెపోటుకు గురయ్యాడు. అతనిని వెంటనే ఒక వాహనంలో రావులపాలెం ఆసుపత్రికి తరలిస్తుండగా ట్రాఫిక్ జామ్ అవడంతో దారి మధ్యలోనే మృతి చెందాడు. ఇలాంటి సంఘటనలు మునుముందు జరగకుండా, ట్రాఫిక్ సమస్యలు లేకుండా చూడటంతో పాటు ఆక్రమణలను తొలగించాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

# చింతూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం




**చింతూరు, మేజర్ న్యూస్ :** స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మహిళా సాధికారత విభాగం ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. సభకు అధ్యక్షత వహించిన ప్రిన్సిపల్ డాక్టర్. కె రత్న మాణిక్యం మాట్లాడుతూ ప్రధానంగా మహిళలు బాలికల విజయాలకు గుర్తింపుగా ప్రతి కార్యాలయంలో, విద్యాసంస్థల్లో మహిళా దినోత్సవాన్ని జరుపుకుంటున్నారన్నారు. మహిళలు అభివృద్ధి చెందితేనే సమాజం మొత్తం పురోగమించి 2047 నాటికి వికసిత్ భారత్ సాధ్యమవుతుందన్నారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఐటీడీఏ ఎ.పి.ఒ సి.హెచ్.రామతులసి మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో ముందుకు సాగుతూ దేశ అభివృద్ధికి ముఖ్యపాత్ర పోషిస్తున్నారని, ఆడపిల్లలకు పరిమితులు విధించకుండా వారి స్వేచ్ఛకు భంగం కలిగించకుండా వారిని అన్ని రంగాల్లో ప్రోత్సహిస్తే సమాజ అభివృద్ధికి తోడ్పడతారన్నారు. వైస్ ప్రిన్సిపాల్ ముల్లి శేఖర్ మాట్లాడుతూ మహిళలు విద్య, వైద్యం, విజ్ఞానం, రాజకీయాలు, క్రీడలు, వ్యాపారం వంటి ప్రతి రంగంలోనూ తమ ప్రతిభను నిరూపిస్తున్నారన్నారు. సీనియర్ అధ్యాపకులు జి. వెంకటరావు మాట్లాడుతూ "ఒక మహిళ చదివితే ఒక కుటుంబం చదివినట్టే" అనే మాట అక్షర సత్యంమని, మహిళలకు విద్య,గౌరవం, అవకాశాలు కల్పిస్తే సమాజం మొత్తం అభివృద్ధి చెందుతుందన్నారు. మహిళా సాధికారత విభాగాధిపతి కె.శైలజ మాట్లాడుతూ మహిళల గౌరవానికి భంగం కలిగించకుండా వారికి సరైన అవకాశాలను అందించి ప్రోత్సహించాలన్నారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వం, పోస్టర్ పెయింటింగ్ పోటీల విజేతలకు ప్రశంసా పత్రాలు, బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ కె.శకుంతల, జి హారతి, ఎస్ అప్పనమ్మ, ఎమ్. నాగమోహన్, జి.సాయికుమార్, ఎన్.ఆనంద్, బి.శ్రీనివాసరావు, కె.ఎల్.ప్రసన్న కుమారి, కె.కీర్తి, ఆర్.కిరణ్మయి, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# 'బీవీసీ'లో ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం




**అల్లవరం, మేజర్ న్యూస్ :** బీవీసీ ఇంజనీరింగ్ కళాశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల చైర్ పర్సన్ బోనం కనకదుర్గ అధ్యక్షతన జరిగిన మహిళా దినోత్సవంలో ఆమె ప్రసంగిస్తూ ఈ రోజుల్లో మహిళలు అన్ని రంగాల్లో ముందంజలో ఉండటమే గాక దేశ భవిష్యత్తు నిర్దేశించే కీలక పదవులను సమర్థవంతంగా పోషిస్తూ ఉన్నారనీ ఇది అందరు మహిళలకు గర్వకారణం అని అన్నారు. మహిళా సాధికారికత అంటే మహిళలు తమ జీవిత నిర్ణయాలను తామే స్వయంగా తీసుకొనేలా సామాజిక, ఆర్థిక,విద్యా మరియూ రాజకీయ రంగాలలో సమాన అవకాశాలు పొంది స్వశక్తి తో ఎదగడమేనని అన్నారు. ఈ సందర్భంగా కళాశాలలోని మహిళలందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు.

అనంతరం ప్రతిష్టాత్మక మైన మహిళా కీర్తి రత్న విమెన్స్ ఎక్సలెన్స్ అవార్డ్‌కు ఎంపికై పురస్కారాన్ని అందుకున్న బోనం కనకదుర్గని ఘనంగా సన్మానించారు. కళాశాల సెక్రటరీ మరియూ కరస్పాండెంట్ బోనం కనకయ్య, ప్రిన్సిపాల్ డీ.మహేశ్వర్, వైస్ ప్రిన్సిపాల్ ఏ.ప్రవీణ్, కార్యనిర్వహణాధికారి ఎ.వై.ఆర్.వి.ప్రసాద్ మహిళలకు ఈ సందర్భంగా తమ శుభాకాంక్షలు తెలియజేశారు.

# ఆకాశంలో సగం,అవనిలో సగం మహిళ

- ఆదిత్య డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం
- దేశ ప్రగతి మహిళా సాధికారత మీద ఆధారపడి ఉంది
- డాక్టర్ మానికిరెడ్డి సత్యనారాయణ



**కాకినాడ, మేజర్ న్యూస్ :** స్థానిక ఆదిత్య డిగ్రీ మరియు పీజీ కళాశాల జాతీయ సేవా పథకం, మానికిరెడ్డి హెల్త్ కేర్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా సంయుక్త ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించినట్లు ఆదిత్య డిగ్రీ మరియు పీ జీ కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బిఈవిఎల్.నాయుడు తెలిపారు. మహిళా సాధికారత లేకుండా దేశ శ్రేయస్సును ఊహించలేం. సృష్టికి మూలం మగువ. ఆకాశంలో సగం, అవనిలో సగం మహిళ. కాస్త ప్రోత్సహిస్తే అవకాశాలలోనూ సగం.. అంతకు మించి అని నిరూపించే స్థితికి వచ్చింది నేటి మహిళ. ఈ సందర్భంగా ఆదిత్య డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం జరిగింది. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ నాయుడు మాట్లాడుతూ ఎక్కడ స్త్రీలు పూజింపబడతారో,అక్కడ దేవతలు నివసిస్తారు అని అన్నారు. భారత దేశంలో స్త్రీలకు ప్రత్యేక స్థానం ఉందని, అన్నిచోట్ల నారీశక్తి ప్రస్ఫుటంగా కనిపిస్తుందని అన్నారు. మహిళల కంట కన్నీళ్లు వస్తే ఆ ఇంట్లో ఆనందం ఉండదని తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మానికిరెడ్డి హెల్త్ కేర్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా చైర్మన్ డాక్టర్ మానికిరెడ్డి సత్యనారాయణ " దేశ ప్రగతి మహిళా సాధికారతపై ఆధారపడి ఉందని ,. అన్ని రంగాలలో స్త్రీలు రాణించాలని, శారీరకంగా మానసికంగా ఆరోగ్యంగా ఉండాలని పిలుపునిచ్చారు. గృహిణి ఆరోగ్యంగా ఉంటే ఆ గృహం ఆనందంగా ఉంటుందని అన్నారు.ఈ సందర్భంగా కళాశాల అధ్యాపకులలో ఉత్తమ సేవలు అందిస్తున్న డి అశ్వని, జె కృష్ణ చంద్రిక, షేక్ కైరున్ బేగం, షేక్ ముంతాజ్, పి నాగమణి లకు ' కీర్తి పురస్కారాలు' అందించారు. ఆటల పోటీలు విజేతలకు డాక్టర్ నాయుడు బహుమతులను అందించారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన ఎన్ ఎస్ ఎస్ బృందాన్ని, సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న డాక్టర్ మానికిరెడ్డి సత్యనారాయణను ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి, డిగ్రీ కళాశాలల సెక్రెటరీ డాక్టర్ నల్లమిల్లి సుగుణా రెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సత్యనారాయణ, ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రాం అధికారులు టి తేజేశ్వరరావు, డి అశ్విని మరియు అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

## శృంగార వల్లభ స్వామి వారిని దర్శించుకున్న భక్తులు

- వేదపండితుల ఆధ్వర్యంలో స్వామివార్కి ప్రత్యేక అలంకరణ



**పెద్దాపురం, మేజర్ న్యూస్ :** పెద్దాపురం మండలం, తిరుపతి గ్రామంలో వేంచేసియున్న శ్రీశ్రీ శృంగార వల్లభ స్వామిని శనివారం వేలాది సంఖ్యలో భక్తులు దర్శించుకోవడం జరిగింది. ఈ సందర్భంగా కార్యనిర్వాహాధికారి వడ్డి శ్రీనివాస రావు మాట్లాడుతూ ప్రత్యేక దర్శనం టికెట్ల ద్వారా రూ. 1,62, 420/-, అన్నదాన విరాళాల ద్వారా రూ.97,598/-లు, కేశఖండన ద్వారా రూ.4,520/-, తులాభారం ద్వారా రూ.650/- లడ్డూ ప్రసాదాల ద్వారా రూ.20,970/- మొత్తం రూ.2,86, 158/-లు స్వామివారికి ఆదాయం రావడం జరిగిందని తెలిపారు. వేద పండితులు ఆధ్వర్యంలో స్వామివారిని పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించడం జరిగింది. అలాగే దేవస్థానం తరపున ఉదయం పులిహోర ప్రసాదం పంపిణీ చేశారు. అనంతరం భక్తులు అన్నదాన కార్యక్రమంలో పాల్గొని, స్వామి వారి ప్రసాదం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన ఛైర్మన్ మొయిళ్ళ సంధ్య కృష్ణమూర్తి, ధర్మకర్తలు, వేదపండితులు పెద్దింటి నారాయణాచార్యులు, ఆలయ సిబ్బంది కృష్ణ, ఇతర స్వచ్ఛంద సేవకులు, గ్రామస్థులు, వేలాది సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# జన్మదిన కానుకగా ఆలయ అభివృద్ధికి విరాళం

- అన్నవరప్పాడులో పుట్టి హైదరాబాదులో స్థిరపడి సొంతఊరుపై మమకారంతో



**పెరవలి, మేజర్ న్యూస్ :** అన్నవరప్పాడులో పుట్టి హైదరాబాదులో స్థిరపడి సొంతఊరుపై మమకారంతో పుట్టినరోజు సందర్భంగా అన్నవరప్పాడు శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయ అభివృద్ధికి విరాళం ఇచ్చిన ప్రముఖ ఆర్కిటెక్ట్ కృష్ణకుమారిని ప్రతి ఒక్కరు అభినందిస్తున్నారు. వివరాల్లోకి వెళ్తే అన్నవరప్పాడు గ్రామంలో పులపర్తి శ్రీరాములు సుబ్బాయమ్మ దంపతులకు జన్మించిన కృష్ణకుమారి చదువులలో ముందంజలో ఉంటూ హైదరాబాద్ లో సృష్టి డిజైన్స్ అనే ఆర్కిటెక్ట్ సంస్థను స్థాపించి తన కాళ్ళపై తాను నిలబడి పలువురికి ఉపాధి కల్పిస్తూ అందరికీ మార్గదర్శకంగా ఉంటుంది. అటువంటి కృష్ణకుమారి తన జన్మదినం సందర్భంగా మార్చి 7వ తేదీ శనివారం అన్నవరప్పాడు గ్రామానికి విచ్చేసి అన్నవరప్పాడు వెంకన్న ఆలయానికి స్వామి దర్శన నిమిత్తం వచ్చారు. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధికి తనవంతుగా 11 వేల రూపాయలను ఆలయ కార్య నిర్వహణ అధికారి మీసాల రాధాకృష్ణకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సోషల్ యాక్టివిస్ట్ సలాది ఉదయభాస్కరరావు, వెంకటరమణి, దివ్యశ్రీ, శిరీష, తదితర గ్రామస్తులు పాల్గొని కృష్ణకుమారి ని అభినందించారు.

## హోమియోపతి ఆసుపత్రికి ఫర్నీచర్ బహూకరణ



**అల్లవరం, మేజర్ న్యూస్ :** కొమరగిరిపట్నం గ్రామం నందు గల ప్రభుత్వ హోమియోపతి ఆసుపత్రికి అవసరమగు ఆఫీస్ ఫర్నీచర్ టేబుల్ మరియు కుర్చీలను మోసుగంటి గంగయ్య మెమోరియల్ ఎడ్యుకేషనల్ అండ్ ఛారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు మోసుగంటి వెంకటేశ్వరరావు బహూకరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ లూకె, తుమ్మలపల్లి సర్పంచ్ వడ్డి సుభాషిణి, ట్రస్ట్ కార్యదర్శి విజయకుమారి, రుద్రరాజు రమేష్ రాజు, వడ్డి ఎలిషారాజు, యలమంచలి రమేష్ పాల్గొన్నారు. ఆసుపత్రికి ఫర్నీచర్ సమకూర్చిన మోసుగంటి ఛారిటబుల్ ట్రస్ట్ సేవలను డాక్టర్ కొనియాడారు.

# ధవళేశ్వరంలో ఆపరేషన్ వజ్ర ప్రహార్‌లో భాగంగా మెగా కార్డన్‌డే



ధవళేశ్వరం, మేజర్ న్యూస్ : డిజిపి హరీష్ కుమార్ గుప్తా ఆదేశముల మేరకు ఈగల్ చీఫ్ ఆకే రవి కృష్ణ ఐజీపి పర్యవేక్షణలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మాదకద్రవ్యాల నియంత్రణకు చేపట్టిన ప్రత్యేక కార్యక్రమం ఆపరేషన్ వజ్రప్రహార్‌లో భాగంగా, రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాలలోని పోలీసు సబ్ డివిజన్‌లలో శనివారం మెగా కార్డన్ & సెర్చ్ ఆపరేషన్ విస్తృతంగా నిర్వహించబడింది. ఇందులో భాగంగా తూర్పు గోదావరి జిల్లా ఎస్‌పి నరసింహా కిషోర్ ఆధ్వర్యంలో రాజమహేంద్రవరం లోని ధవళేశ్వరం పోలీస్ స్టేషన్ పరిధిలోని కలెక్టర్ ఆఫీస్ వెనుక వైపు ఉన్నటువంటి ప్రభుత్వ టిడ్కో గృహములందు ఈ మెగా కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు.రాష్ట్రవ్యాప్తంగా మాదకద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణా మరియు సంబంధిత నేరాలను అరికట్టడమే లక్ష్యంగా ఈ ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. ఈ మెగా ఆపరేషన్‌ను సౌత్ జోన్" ఎస్‌పి భవ్య కిషోర్ పర్యవేక్షణలో నిర్వహించారు. పోలీసు అధికారులు, సిబ్బంది, స్పెషల్ టీమ్‌లు కలిసి గుర్తించిన హాట్‌స్పాట్ ప్రాంతాలలో విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. ఈ కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్‌లో భాగంగా మొత్తం 50 మంది పోలీసు అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోలీసులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించి ప్రజల వివరాలు, వాహనాల వివరాలు మరియు అనుమానాస్పద వ్యక్తులపై పరిశీలన చేసారు.ఈ ఆపరేషన్‌లో భాగంగా మొత్తం 600 మంది వ్యక్తులను తనిఖీ చేశారు. 150 వాహనాలను తనిఖీ చేశారు. సరైన పత్రాలు లేని 25 వాహనాలను గుర్తించారు. మొత్తం 25 వాహనాలను సీజ్ చేశారు. రౌడీ షీటర్లు మరియు సస్పెక్ట్ షీట్లు ఉన్న వ్యక్తులను స్పాట్‌లో పిలిపించి వారికి కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులు ప్రజలకు మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే ఆరోగ్య, సామాజిక మరియు చట్టపరమైన దుష్పరిణామాల గురించి అవగాహన కల్పించారు. గంజాయి మరియు ఇతర మాదకద్రవ్యాల వినియోగం యువత భవిష్యత్తును నాశనం చేస్తుందని, కుటుంబ వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతుందని వివరించారు. ప్రజలు తమ పరిసర ప్రాంతాల్లో గంజాయి లేదా ఇతర మాదకద్రవ్యాలకు సంబంధించిన సమాచారం ఉంటే వెంటనే ఏపీ ఈగల్ టోల్ ఫ్రీ నెంబర్ 1972 కు సమాచారం అందించాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు. సమాచారం ఇచ్చే వారి వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబడతాయని హామీ ఇచ్చారు. అదేవిధంగా ఈ కార్యక్రమంలో భాగంగా పోలీసు అధికారులు, సిబ్బంది మరియు ప్రజలతో కలిసి "ఆపరేషన్ వజ్రప్రహార్ ప్రతిజ్ఞ" నిర్వహించి మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా పోరాడాలని ప్రతిజ్ఞ చేశారు. సమాజాన్ని డ్రగ్స్ రహితంగా మార్చడంలో ప్రజల సహకారం ఎంతో ముఖ్యమని అధికారులు పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మాదకద్రవ్యాల వ్యాప్తిని పూర్తిగా అరికట్టే దిశగా "ఆపరేషన్ వజ్ర ప్రహార్" కింద ఇలాంటి ప్రత్యేక చర్యలు నిరంతరం కొనసాగుతాయని తెలియజేసారు ప్రజల సహకారంతో డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మించడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని చెప్పారు.

## రక్తదానం మరొకరి ప్రాణం దానం



**సామర్లకోట, మేజర్ న్యూస్ :** రక్తదానం మరొకరి ప్రాణం దానం చేయడమేనని డిసిసిబి ఛైర్మన్ తుమ్మల బాబు, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షులు నిమ్మకాయల రంగనాగ్‌లు పేర్కొన్నారు. సామర్లకోట యువత ఆధ్వర్యంలో లయన్స్ క్లబ్ భవనంలో మెగా రక్త దాన శిబిరాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా తుమ్మల బాబు, రంగనాగ్‌లు హాజరై రక్త దానం చేసిన యువకులను అభినందించారు. సామర్లకోట యువత ఆధ్వర్యంలో రక్త దానం శిబిరాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు దేవగురు చంద్ర శేఖర్, సూరజ్, సరోజ వాసు, పి.జానకి రామారావు టీడీపీ నాయకులు బదుగు శ్రీకాంత్, అడబాల కుమార స్వామి, కంటే జగదీష్ మోహన్, బలుసు వాసు, తాతపూడి కృష్ణ బాబు, అందుగుల జార్జి చక్రవర్తి, గోల్తి సత్యనారాయణ, లయన్స్ క్లబ్ అధ్యక్షులు అమలకంటి శ్రీనివాస్, నూతలపాటి అప్పలకొండ తదితరులు పాల్గొన్నారు.

# మహిళల భద్రత - బాలికల రక్షణ, వివాహాల నిర్మూలనపై సైకిల్ ర్యాలీ




**సామర్లకోట, మేజర్ న్యూస్ :** అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాల సందర్భంగా మహిళా అభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సామర్లకోట మండలంలో అవగాహన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. మహిళా అభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ సి.హెచ్. లక్ష్మి ఆదేశాల మేరకు ఐసీడీఎస్ ప్రాజెక్ట్, విద్యాశాఖ మరియు పోలీస్ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆధ్వర్యంలో సామర్లకోట మండల ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల నుండి బ్రౌన్‌పేట సెంటర్ వరకు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో పాల్గొన్న విద్యార్థినులు "బేటీ బచావో - బేటీ పడావో", "బాల్య వివాహాలకు నో చెప్పండి", "ఆడబిడ్డను కాపాడండి - చదివించండి" వంటి నినాదాలతో ప్రజల్లో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమములో ఐసీడియస్ ప్రాజెక్ట్ సిడిపివో జి.ఉష, సర్కిల్ ఇన్స్పెక్టర్ కృష్ణ భగవాన్ మరియు చైల్డ్ హెల్ప్ లైన్ నిర్వాహకులు స్కూల్ ప్రధానోపాధ్యాయులు రాయుడు విజయలక్ష్మి, ఐసీడియస్ సూపర్ వైజర్లు ఉమా దేవి, సుల్తాన్ బీబి, క్రాఫ్ స్వచ్ఛంద సంస్థ కోఆర్డినేటర్ బి.కుమారి, లక్ష్మి, అంగన్వాడీ వర్కర్లు మరియు విద్యార్థినులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఐసీడియస్ ప్రాజెక్ట్ సి డి పి వో జి ఉష, సర్కిల్ ఇన్స్పెక్టర్ కృష్ణ భగవాన్ మాట్లాడుతూ బాలికల రక్షణ, విద్యాభివృద్ధి మరియు బాల్య వివాహాల నిర్మూలన కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేయాలని ఈ సందర్భంగా అధికారులు పిలుపునిచ్చారు. ఈ ర్యాలీ ద్వారా పి సి పి ఎన్ డి ౦ ాజ చట్టం గురించి ప్రజలకు వివరించి, గర్భంలో శిశు లింగ నిర్ధారణ చేయడం చట్ట విరుద్ధమని తెలియజేశారు. అలాగే బాల్య వివాహాల వల్ల బాలికల ఆరోగ్యం, విద్య మరియు భవిష్యత్తుపై పడే ప్రతికూల ప్రభావాలను వివరించారు. బాలికల విద్యాభివృద్ధి మరియు సమాన హక్కుల కోసం సమాజం మొత్తం కలిసి పనిచేయాలని అధికారులు పిలుపునిచ్చారు. బాలికల రక్షణ, విద్యాభివృద్ధి మరియు బాల్య వివాహాల నిర్మూలన ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారా సమాజంలో చైతన్యం పెంపొందించడమే ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సిబ్బంది, ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

# రచ్చబండ కార్యక్రమాన్ని జయప్రదం చేయండి

**జగ్గంపేట, మేజర్ న్యూస్ :** ఈనెల 13న జగ్గంపేట మండలం కాట్రావులపల్లి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు వైయస్ షర్మిల రెడ్డి నిర్వహించబోయే ఉపాధి హామీ పరిరక్షణ యాత్ర భాగంగా నిర్వహిస్తున్న రచ్చబండ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని నియోజకవర్గ ఇన్చార్జ్ మరోతి శివ గణేష్ పిలుపునిచ్చారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 60 శాతం కేంద్ర నిధులు ఇచ్చే బీబీ గ్రామ్ చట్టం వద్దని 100 శాతం కేంద్ర నిధులు ఇచ్చే మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని కొనసాగించాలని రాష్ట్రవ్యాప్తంగా రాయలసీమ నుంచి ఉత్తరాంధ్ర వరకు వైయస్ షర్మిల రెడ్డి చేపట్టిన ఉపాధి హామీ పరిరక్షణ యాత్ర అన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గంలో కాట్రావులపల్లి గ్రామంలో మార్చి 13 తేదీన జరిగే రచ్చబండ సభా ప్రదేశాన్ని పరిశీలించడం జరిగిందన్నారు. డిసిసి అధ్యక్షులు మాదేపల్లి సత్యానందరావు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలో అధిక శాతం బడుగు బలహీన వర్గాలకు జీవనాధారమైన "మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని"పరిరక్షించేందుకు పిసిసి అధ్యక్షులు శ వైఎస్ షర్మిల రెడ్డి చేపట్టిన "ఉపాధి హామీ పరిరక్షణ యాత్ర" కార్యక్రమం కాట్రావులపల్లి గ్రామంలో జరిపించ తలపెట్టామని, ఉపాధి హామీ కూలీలు, ప్రజలు కాట్రావులపల్లి గ్రామానికి విచ్చేసి



రచ్చబండ కార్యక్రమంలో హాజరు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో పిసిసి సభ్యులు జగ్గంపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వత్సవాయి సత్యనారాయణ రాజు , ఏపీ సి సి జనరల్ సెక్రెటరీ డాక్టర్ నక్క సత్యనారాయణ, కాంగ్రెస్ పార్టీ జగ్గంపేట నియోజకవర్గం బ్లాక్ వన్ అధ్యక్షులు చంద్రమౌళి వెంకటరత్నం, రాష్ట్ర యూత్ కాంగ్రెస్ నాయకులు గొంప కొండబాబు యాదవ్, కాకినాడ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు మొయ్యటి సూర్యప్రకాష్ రావు, డిసీసీ ఉపాధ్యక్షులు కొప్పన కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



# మందేశ్వర ఆలయంలో భక్తుల తైలాభిషేకాలు

**కొత్తపేట, మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని మందపల్లి గ్రామంలో వేంచేసియున్న శ్రీ మందేశ్వర (శనేశ్వర)స్వామి వారి దేవస్థానంలో శనివారం సందర్భంగా భక్తులు పోటెత్తారు. తెల్లవారుజాము నుండి స్వామి వారికి ప్రాతఃకాల అర్చన నిర్వహించి, అనంతరం భక్తులచే తైలాభిషేకాలు, సర్వ దర్శనములు జరిపించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ సహాయ కమీషనర్,కార్య నిర్వహణాధికారి దారపురెడ్డి సురేష్ బాబు ఆధ్వర్యంలో తగిన ఏర్పాట్లు చేశారు.పలు సేవల ద్వారా స్వామి వారికి రూ.2,19,905 ఆదాయం వచ్చినట్లు ఆయన తెలియజేశారు.

# ప్రతిభలో టేస్ట్ ది టాలెంట్ & వెజ్ మార్ట్‌కి అత్యద్భుత స్పందన



సామార్లకోట, మేజర్ న్యూస్ : అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని, సామర్లకోట ప్రతిభ విద్యా నికేతన్ పాఠశాలలో శనివారం నిర్వహించిన టేస్ట్ ది టాలెంట్ మరియు వెజ్ మార్ట్ కార్యక్రమంలో విద్యార్థుల తల్లులు ఎంతో ఉత్సాహంతో పాల్గొని, తాము స్వయంగా తయారు చేసిన వివిధ రకాల తినుబండారాలను వారి పిల్లలతో కలిపి ప్రదర్శనకు ఉంచి అందరికీ రుచి చూపించారు.

ఈ కార్యక్రమాన్ని పాఠశాల కరస్పాండెంట్ ఎస్. వి.వి.జి. ప్రకాష్ మరియు డైరెక్టర్ సుధారాణి ప్రకాష్ దంపతులు ప్రారంభించారు. ఈసందర్భంగా ప్రకాష్ మాట్లాడుతూ " వీధి తినుబండారాలు అందించే రుచులకు పిల్లలు అలవాటుపడి అనారోగ్యాన్ని కొని తెచ్చుకుంటున్నారని,అదే రుచులలో తినే పదార్థాలను తమ తల్లులు కూడా తయారుచేయగలరని, వారి ఈ టాలెంట్‌ను పిల్లలకు తెలియచేసే ఉద్దేశ్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించామని, దానికి విశేషంగా స్పందించి వచ్చిందని అన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ కేటగిరీలలో ప్రదర్శించిన పదార్థాలలో ఉత్తమ రుచికరమైనవిగా నిర్ణయించడానికి జడ్జీలకు ఒకవిధంగా చాలా కష్టతరమైన బాధ్యత అయిందనే చెప్పవచ్చు అని, అయినా తమ సాయశక్తుల ప్రయత్నించి ఎంపికచేశామని వివిధ విభాగాలకు ఏర్పాటు చేసిన న్యాయనిర్ణేతలు తెలియచేశారు.

ఈ ప్రదర్శనలో ఉత్తమమమైనవిగా : శాఖాహార విభాగంలో జి.వీణ, మాంసాహార విభాగంలో- ఎస్కె. కరీమా సుల్తానా,స్వీట్ విభాగంలో - ఎన్.సాయి సత్య రాజేశ్వరి, చాట్ విభాగంలో- జి.రత్నకుమారి లు తయారుచేసిన వాటిని నిర్ణయించి, వారికి బహుమతుల ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ టి.సునీత, వైస్ ప్రిన్సిపాల్ పి. శ్రీగౌరి, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# మందేశ్వర ఆలయ అభివృద్ధికి నిధులు



**కొత్తపేట, మేజర్ న్యూస్ :** ప్రసిద్ధిగాంచిన మందపల్లి శ్రీ మందేశ్వర(శనేశ్వర) స్వామి ఆలయ అభివృద్ధికి పుష్కర నిధుల నుంచి భారీ మొత్తంలో నిధులు మంజూరయ్యాయని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు తెలిపారు. ఆలయ ప్రాంగణంలో నిర్మించనున్న నూతన శాశ్వత అన్నదాన భవనానికి సుమారు రూ.1 కోటి 20 లక్షలు పుష్కర నిధుల నుంచి మంజూరయ్యాయని, త్వరలోనే టెండర్లను పిలిచి పనులు ప్రారంభిస్తామని ఎమ్మెల్యే వెల్లడించారు. అలాగే గతంలో కూడా మందేశ్వర స్వామి ఆలయానికి పుష్కర నిధుల నుంచి శాశ్వత తైలాభిషేక భవన నిర్మాణానికి రూ.3 కోట్లు మంజూరయ్యాయని ఈ భవనానికి ఈనెల 10వ తేదీన శంకుస్థాపన చేస్తున్నట్లు తెలిపారు. ఈ ఆలయ అభివృద్ధికి భారీ మొత్తంలో నిధులు కేటాయించి సహకరిస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు,ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్,దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డిలకు ఎమ్మెల్యే బండారు కృతజ్ఞతలు తెలిపారు.

# ఎమ్మెల్యే బండారుకు కృతజ్ఞతలు





**కొత్తపేట, మేజర్ న్యూస్ :** కొత్తపేట మార్కెట్ యార్డ్ నూతన చైర్మన్‌గా నియమితులైన పల్లి మంగాదేవి భీమరావు,వైస్ చైర్మన్ గా నియమితులైన కంఠంశెట్టి శ్రీనివాసరావులు శనివారం వాడపాలెం ఎమ్మెల్యే కార్యాలయం వద్ద ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ను మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఎమ్మెల్యే బండారు సత్యానందరావు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకునే విధంగా మార్కెట్ యార్డ్ అభివృద్ధికి కృషి చేస్తామని పేర్కొన్నారు. రైతులకు మరింత మెరుగైన సేవలు అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ఇరువురికి శుభాకాంక్షలు తెలియజేసి రావులపాలెం మార్కెట్ యార్డ్ అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ ఎంపిక పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.

# రెండు వేరు వేరు దాడుల్లో లక్ష విలువైన కలప స్వాధీనం






**అడ్డతీగల, మేజర్ న్యూస్ :** ఏజెన్సీ అడ్డతీగల మండలంలోని రెండు వేరువేరు చోట్ల అటవీ శాఖ అధికారులు పక్కా సమాచారంతో నిర్వహించిన దాడుల్లో లక్ష రూపాయల విలువైన అక్రమకలపను స్వాధీనం చేసుకున్నారు. వివరాల్లోకి వెళితే అడ్డతీగల రేంజ్ పరిధిలోని వై రామవరం మండలం దేవరమడుగుల గ్రామ సమీపంలో బొలెరో వాహనంలో తరలించడానికి సిద్ధంగా ఉన్న టేకు, ఎగిసా జాతికి చెందిన 70 వేల రూపాయలు విలువచేసే కలపను వ్యాన్‌తో సహా స్వాధీనం చేసుకొని అడ్డతీగల అడవి శాఖ కార్యాలయానికి తరలించి కేసు నమోదు చేశారు. అలాగే మట్లపాడు గ్రామంలో కొంటె చింత జాతికి చెందిన సుమారు 30 వేల రూపాయల విలువైన మారుజాతి కలపను స్వాధీనం చేసుకుని స్థానిక ఫారెస్ట్ కార్యాలయానికి తరలించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు అటవీ శాఖ అధికారులు వెల్లడించారు.

# యుక్త ధార సాఫ్ట్‌వేర్ పోర్టల్ విధివిధాలపై శిక్షణ






**రంపచోడవరం, మేజర్ న్యూస్ :** వచ్చే ఏప్రిల్ ఒకటో తేది నుండి వి.బి జి రామ్ జీ పథకం యుక్త ధార సాఫ్ట్వేర్ పోర్టల్ ద్వారా (ఉపాధి పనులు) చేయించడం జరుగుతుందని విబిజి రామ్ జీ పథకం ఏపిడి ఎల్.రాంబాబు తెలిపారు. స్థానిక ఐటీడీఏ సమావేశం హాల్లో పోలవరం జిల్లా పరిధిలోని 12 మండలాల ఏపీఓ లు, ఈసీలు, జేఈ లు, బిఎఫ్‌టి లతో యుక్త ధార సాఫ్ట్‌వేర్ పోర్టల్ విధివిధాలపై శిక్షణ కార్యక్రమాన్ని వి.బి జి రామ్ జీ పథక ఏపిడి లు ఎల్.రాంబాబు, శ్రీకాంత్, సిఆర్‌డి టెక్నికల్ పర్సన్ సునీల్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా విబి జి రామ్ జీ పథకం ఏపిడి ఎల్ రాంబాబు మాట్లాడుతూ విబి జీ రామ్ జి పథకం ద్వారా ప్రతీ కుటుంబానికి వచ్చే ఏప్రియల్ ఒకటో తేది నుండి ప్రతి కుటుంబానికి 125 రోజులు పనులు కల్పించే విధంగా ప్రభుత్వం నుండి అనుమతులు రావడం జరిగిందని తెలిపారు. విబిజి రామ్ జి పథకం యుక్త ధార సాఫ్ట్‌వేర్ పోర్టల్ ద్వారా ప్రతి పనికి అనుసంధానం చేయడం జరిగిందని ఆయన తెలిపారు. ఈ పనులకు సంబందించి పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ ద్వారా శిక్షణ ఇవ్వడం జరిగిందని ఆయన తెలిపారు. మంజూరైన పనులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించి సకాలంలో పూర్తి చేయించే బాధ్యత మనందరిపై ఉందని ఆయన తెలిపారు. ఈ సంవత్సరం ఏప్రిల్ నెల నుండి గుర్తించిన కొత్త పనులను మంజూరైన వెంటనే పనులు ప్రారంభించడం జరుగుతుందని ఆయన అన్నారు. వి. బి జి రామ్ జి పథకం ద్వారా ముఖ్యంగా జల సంరక్షణ పనులు, గ్రామీణ మౌలిక వసతులకు సంబంధించిన పనులు, జీవన ఉపాధి మెరుగుదలకు సంబంధించిన పనులు, పకృతి వైపరీత్యాలను ఎదుర్కొనే పనులకు ముఖ్య ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందన్నారు. పోలవరం జిల్లా పరిధిలోని 12 మండలాలకు సంబంధించిన ప్రతి గ్రామంలో యుక్త ధార సాఫ్ట్‌వేర్ పోర్టల్ విధివిధానాలపై అవగాహన కల్పించడం జరుగుతుందని ఆయన తెలిపారు. విబి జి రామ్ జీ పథకం ద్వారా ఈ ప్రాంత అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెద్దపీట వేయడం జరిగిందని, అదేవిధంగా ప్రతి కుటుంబానికి 125 రోజులు ఉపాధి పనులు కల్పించడమే ఈ పథకం ముఖ్య ఉద్దేశమని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీవోలు సురేష్ కుమార్, ప్రకాష్, సాయిబాబా, సత్యనారాయణ, చిరంజీవి, మణి కుమారి, స్వామి, శ్రీనివాస్, రాఘవయ్య, శ్యామ్ రాజు, అరవాలు, ఈసీలు, జేఈలు, టిఏ లు, బిఎఫ్‌టీలు పాల్గొన్నారు.

# చింతూరు పోలీసుల ఆధ్వర్యంలో "మెగా కార్డన్ డే"



**చింతూరు, మేజర్ న్యూస్ :** రాష్ట్ర డి జి పి.హరీష్ కుమార్ గుప్తా, ఆదేశాల మేరకు ఈగల్ చీఫ్ ఐజి పి.ఆకే రవి కృష్ణ పర్యవేక్షణలో పోలవరం జిల్లా ఇంచార్జి ఎస్పి అమిత్ బర్దార్ ఆధ్వర్యంలో చింతూరు ఏఎస్‌పి బొడ్డు హేమంత్, చింతూరు ఇంచార్జి సీఐ కన్నప రాజు, ఎస్సై పేరూరి రమేష్ ఈగల్ టీం, స్టేషన్ సిబ్బంది, ఎయన్‌యస్ సిబ్బంది సంయుక్తంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మాదకద్రవ్యాల నియంత్రణకు చేపట్టిన ప్రత్యేక కార్యక్రమం 'ఆపరేషన్ వజ్రప్రహార్' లో భాగంగా, చింతూరు ఎస్టి కాలనీ, మెడికల్ కాలనీలో శనివారం మెగా కార్డన్ & సెర్చ్ ఆపరేషన్ విస్తృతంగా నిర్వహించబడింది. ముఖ్యంగా మాదకద్రవ్యాల వినియోగం జరుగుతున్నట్లు అనుమానం ఉన్న ప్రాంతాలు, అద్దె ఇళ్లు, విద్యార్థుల హాస్టళ్లు, పీజీ నివాసాలు, చిన్న లాడ్జిలు, ఖాళీ భవనాలు, బస్ స్టాండ్లు ఇతర అనుమానాస్పద ప్రదేశాలలో పోలీసులు సోదాలు నిర్వహించారు. ఈ కార్డన్ సెర్చ్ ఆపరేషన్లో భాగంగా మొత్తం 20 మంది పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోలీసులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించి ప్రజల వివరాలు, వాహనాల వివరాలు, అనుమానాస్పద వ్యక్తులపై పరిశీలన చేపట్టారు. 120 మంది వ్యక్తులను ఫింగర్ ప్రింట్ డివైజ్ ద్వారా చెక్ చేసి పాత నేరాల గురించి వెరిఫై చేశారు. వారి యొక్క వాహనాలను తనిఖీ చేశారు. డ్రోన్ ద్వారా అనుమానాస్పద ప్రదేశాలను ఏరియల్ సర్వే చేశారు. సరైన పత్రాలు లేని 11 వాహనాలను గుర్తించారు. రౌడీ షీట్ ఉన్న వ్యక్తులను స్పాట్‌లో పిలిపించి వారికి కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులు ప్రజలకు మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే ఆరోగ్య, సామాజిక చట్టపరమైన దుష్పరిణామాల గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అధికారులతో పాటు ఏఎస్‌ఐ లు మల్లికార్జున్, దొర, హెడ్ కానిస్టేబుళ్లు, పోలీస్ సిబ్బంది, ఏఎన్ఎస్ పార్టీ పోలీసులు, సీఆర్పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

# మహిళల సంక్షేమాన్ని గాలికి వదిలేసిన కూటమి ప్రభుత్వం

**– అమలాపురం మాజీ ఎంపీ చింతా అనురాధ**



**అల్లవరం, మేజర్ న్యూస్ :** కోట్లాది మంది అక్కచెల్లెమ్మలకు వైయస్ జగన్ మోహన్ రెడ్డి నేరుగా తమ ఖాతాల్లోకి సుమారు రూ.1.89 లక్షల కోట్లు వేశారని కానీ నేటి కూటమి ప్రభుత్వం మాత్రం నిలువునా ముంచుతోందని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నట్లు అమలాపురం మాజీ పార్లమెంట్ సభ్యులు చింతా అనురాధ పేర్కొన్నారు. సూపర్ సిక్స్ అంటూ ఊదర కొట్టి, దొంగ బాండ్లను పంపించిన బాబు ఇప్పటి వరకూ, 18 నుంచి 59 ఏళ్ల లోపు మహిళలకు ఆడబిడ్డ నిధి ద్వారా ఏడాదికి రూ.18 వేలు, 50 ఏళ్లకే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు నెలకు రూ.4 వేల చొప్పున పెన్షన్, సున్నా వడ్డీతో మహిళా పొదుపు సంఘానికి రూ.10 లక్షల చొప్పున రుణాల ఊసు ఎత్తడం లేదని, అరకొర పథకాలు అమలు చేస్తూ ఎంతసేపు ప్రచార ఆర్భాటంతో గడుపుతున్నారని ఆమె ఘాటుగా విమర్శించారు. వైయస్ జగన్ మోహన్ రెడ్డి సొంత సోదరుడిలా అండగా నిలబడి మహిళల భద్రత కోసం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన దిశా చట్టం, దిశా యాప్ మొదలైన వాటికి బాబు తూట్లు పొడిచారని, అందుకే రాష్ట్రం మొత్తంలో మహిళలపై గతంలో ఎన్నడూ చూడని విధంగా అత్యాచారాలు, దాడులు పెరిగిపోయాయన్నారు. మహిళల భద్రత, గౌరవాన్ని కాపాడటంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, అత్యవసర సేవలను కూడా నిర్లక్ష్యం చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ లోని అక్కాచెల్లెమ్మలకు నిజమైన సాధికారత లభించేలా చిత్తశుద్ధితో వ్యవహరించాలని అమలాపురం మాజీ పార్లమెంట్ సభ్యులు చింతా అనురాధ కూటమి ప్రభుత్వానికి హితవు పలికారు.

## మున్సిపల్ మహిళా కార్మికులకు ప్రొత్సాహక బహుమతులు ఇవ్వాలి



**పెద్దాపురం,మేజర్‌న్యూస్ :** అంతర్జాతీయ మహిళా దినోత్సవం మార్చ్ 8న ప్రపంచవ్యాప్తంగా ఘనంగా నిర్వహించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయని, మున్సిపల్ మహిళా కార్మికులు ప్రకృతి వైపరీత్యాలలోను, ఎండలు, వానలలోను ప్రాణాలు సైతం లెక్కచేయకుండా ప్రజారోగ్యం, పర్యావరణం, పట్టణాల సర్వతోముఖాభివృద్ధికి పాటు పడుతు న్నారని వారి సేవలకు గుర్తింపుగా మహిళా కార్మికులకు అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ప్రొత్సాహ కరమైన బహుమతులు ఇవ్వాలని, సిఐటియు పెద్దాపురం మండల కమిటి డిమాండ్ చేసింది. దీనిలో భాగంగా మున్సిపల్ కార్యాలయం ఎదుట మున్సిపల్ కార్మికులు ధర్నా నిర్వహించి, పలు డిమాండ్లను నెరవేర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు క్రాంతికుమార్, శ్రీనివాస్, అప్పారావు, గిరి, శేఖర్, శకుంతల, భవాని, విజయ, లక్ష్మీ, పలువురు మహిళా కార్మికులు పాల్గొన్నారు.

## నూరుశాతం ఇంటి పన్నులు వసూలు చేయాలి

**– డిప్యూటి ఎంపిడిఓ**



**పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్ :** గ్రామాలలో ఇంటి పన్నులు మరియు మంచినీటి కుళాయి పన్నులు నూరుశాతం వసూలు చేయాలని పెద్దాపురం డిప్యూటి ఎంపిడిఓ జి.వి.శేఖర్ రెడ్డి సూచించారు. మండలంలోని పులిమేరు, దివిలి గ్రామాలలో పర్యటించి ఇంటి పన్నులు, ఇతర పన్నుల వసూళ్ళ తీరును పరిశీలించారు. సకాలంలో ఇంటి పన్నులు వసూళ్ళు పూర్తి చేయాలని సంబంధిత సిబ్బందికి ఆయన సూచించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికి వెళ్ళి గ్రామస్థులతో మాట్లాడి గ్రామ పరిధిలో త్రాగునీరు పూర్తిస్థాయిలో సరఫరా చేయాలన్నా, అభివృద్ధి జరగలాన్నా, పన్నులు సకాలంలో చెల్లించి సహకరించాలని ప్రజలకు వివరించారు. ఆయన వెంట పంచాయతీ సెక్రటరీలు ఈశ్వరరావు, పంచాయతీ సిబ్బంది, తదితరులు ఉన్నారు.

## శాంతి భద్రతల పరిరక్షణకు ప్రతీఒక్కరూ సహకరించాలి

**– ఇన్‌చార్జి డిఎస్‌పి కె.వి.వి.సత్యనారాయణ**



**పెద్దాపురంరూరల్,మేజర్ న్యూస్ :** శాంతిభద్రతల పరిరక్షణకు ప్రతీఒక్కరూ సహకరించాలని, అపరిచితులు, అనుమానితులు కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలని పెద్దాపురం ఇన్‌చార్జి డిఎస్‌పి కె.వి.వి.సత్య నారాయణ తెలిపారు. శనివారం ఉదయం పెద్దాపురం పట్టణ శివారు సూరంపాలెం రోడ్డులో గల జగనన్న కాలనీలో కార్డెన్ & సెర్చ్ జిల్లా ఎస్‌పి జి.బిందు మాధవ్ ఆదేశాల మేరకు సిఐ విజయశంకర్, ఎస్సై వి.మౌనికల ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది తనిఖీలు నిర్వహించారు. డిఎస్‌పి మాట్లాడుతూ మహిళలు, చిన్నారులు, ప్రధానంగా యువత సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఆయన సూచించారు. శాంతి భద్రతల పరిరక్షణ కోసం పోలీసులు చేస్తున్న విధులకు ప్రతీ ఒక్కరూ సహకరించాలని సిఐ విజయశంకర్, ఎస్సై వి.మౌనికలు తెలిపారు. దీనిలో భాగంగా రికార్డులు సక్రమంగా లేని వాహనాలను సీజ్ చేశారు. ఈ కార్డెన్ సెర్చ్‌లో పెద్ద ఎత్తున పోలీసులు పాల్గొన్నారు.